


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 11-07-2025 | సంపుటి - 24 | సంచిక - 68 | రూ : 4 | పేజీలు: 8


### స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై
## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

- బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు తెలంగాణ కేబినెట్ ఆమోదం
- స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన
- రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలని ప్రభుత్వం స్పష్టీకరణ
- అమిటీ, సెంటినరీ సంస్థలకు యూనివర్సిటీ హోదా మంజూరు
- 17 వేలకు పైగా ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ సిద్ధం




తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. తరువాయి 2లో

### ఎంతో థ్రిల్లింగ్ గా ఉంది...
## ఏపీలో ఇది ఫస్ట్ స్మార్ట్ కిచెన్

- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై మంత్రి లోకేశ్ స్పందన
- కడపలో ప్రారంభమైన ఏపీ తొలి స్మార్ట్ కిచెన్
- 12 స్కూళ్లలోని 2,200 మంది విద్యార్థులకు వేడివేడి భోజనం
- వంట నుంచి పంపిణీ వరకు మొబైల్ యాప్‌తో పర్యవేక్షణ
- ప్రస్తుత బడ్జెట్‌తోనే ఈ వినూత్న కార్యక్రమం అమలు
- త్వరలో మరో నాలుగు స్మార్ట్ కిచెన్లు ఏర్పాటుకు సన్నాహాలు


2లో

### ట్రంప్‌ను టార్గెట్ చేస్తాం
## ఫ్లోరిడాలోనూ వదలం: ఇరాన్ తీవ్ర హెచ్చరిక
ట్రంప్‌కు ఇరాన్ నుంచి హత్యాయత్నం బెదిరింపులు 2లో

## ఐదు దేశాల పర్యటనను ముగించుకుని భారత్‌కు చేరుకున్న మోదీ



- 8 రోజుల విదేశీ పర్యటన ముగించుకుని భారత్‌కు వచ్చిన ప్రధాని
- ఒకే పర్యటనలో మూడు దేశాల అత్యున్నత పురస్కారాలు
- 2014 నుంచి మోదీకి ఇప్పటివరకు 27 అంతర్జాతీయ పురస్కారాలు

ప్రధాని మోదీ తన ఎనిమిది రోజుల విదేశీ పర్యటనలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఒకే పర్యటనలో ఏకంగా మూడు దేశాల అత్యున్నత పౌర పురస్కారాలను స్వీకరించిన ఆయన, తన పర్యటనను విజయవంతంగా ముగించుకుని భారత్‌కు తిరిగి వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా బ్రెజిల్, నమీబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలను ప్రధాని మోదీకి అందించి సత్కరించాయి. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోదీ విదేశీ ప్రభుత్వాల నుంచి అందుకున్న అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య దీనితో 27కు చేరింది. మొత్తం 8 రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాతో సహా ఐదు దేశాలను సందర్శించారు. గ్లోబల్ సౌత్‌లో భారతదేశ ప్రభావాన్ని పెంచడం, ద్వైపాక్షిక సంబంధాలను పటిష్టం చేయడం, ఆర్థిక సహకారాన్ని తరువాయి 2లో



2లో

### వాళ్లను భర్తీ చేయడం
## ఏఐ వల్ల కూడా కాదు

- ఏఐతో ఉద్యోగాలపై ఆందోళనల నేపథ్యంలో బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు
- వచ్చే 100 ఏళ్ల వరకు ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదు
- ఏఐ కేవలం అసిస్టెంట్ మాత్రమే, పూర్తి ప్రత్యామ్నాయం కాదు
- కోడింగ్‌కు సృజనాత్మకత, మానవ మేధస్సు అత్యంత కీలకం
- ఏఐతో ముప్పుపై తనకూ ఆందోళన ఉందని అంగీకరించిన గేట్స్
- ఏఐని సరిగ్గా వాడితే ఉత్పాదకత, ఖాళీ సమయం పెరుగుతాయి

### సత్యసాయి మహా సమాధిని
## సందర్శించిన సీఎం చంద్రబాబు

- శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- కొత్తచెరువులో మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్న సీఎం
- పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి చేరుకున్న చంద్రబాబు, లోకేశ్
- సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న ముఖ్యమంత్రి
- సీఎం వెంట కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం నాడు శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించి, శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కూడా ఈ

తరువాయి 2లో






### భారత క్రికెట్ దిగ్గజం సచిన్ కు
## 'లార్డ్స్'లో అరుదైన గౌరవం

- లార్డ్స్ మ్యూజియంలో సచిన్ టెండూల్కర్ చిత్రపటం ఆవిష్కరణ
- ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్న సచిన్
- 1983 ప్రపంచకప్‌తోనే లార్డ్స్ తో తొలి పరిచయమని వెల్లడి
- కపిల్ ట్రోఫీ అందుకోవడమే తన క్రికెట్ ప్రయాణానికి స్ఫూర్తి
- ఇదే మైదానంలో టెస్టు మ్యాచ్‌ను గంట మోగించి ప్రారంభించిన మాస్టర్

భారత క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు అరుదైన గౌరవం లభించింది. క్రికెట్ మక్కాగా పేరుగాంచిన ప్రతిష్ఠాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ మ్యూజియంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు తరువాయి 2లో

## ఐదు దేశాల పర్యటనను
# ముగించుకుని భారత్‌కు చేరుకున్న మోదీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సహించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యాలు. బ్రెజిల్‌లో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న మోదీ.. ప్రపంచ ఆర్థిక పాలన, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. అలాగే, అర్జెంటీనాతో వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, రక్షణ రంగాల్లో సహకారంపై చర్చించగా.. ఘనా, నమీబియా దేశాల్లో మౌలిక వసతులు, విద్యా భాగస్వామ్యాలపై దృష్టి సారించారు. కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలపడ్డాయి.

## సత్యసాయి మహా సమాధిని
# సందర్శించిన సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో పాల్గొన్నారు. వివరాల్లోకి వెళితే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ తన పర్యటనలో భాగంగా తొలుత కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం, ఆయన నేరుగా పుట్టపర్తికి బయలుదేరి వెళ్లారు. అక్కడ ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి బాబా మహాసమాధి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంత్రి నారా లోకేశ్ నివాళులర్పించారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక నాయకులు, అధికారులు కూడా పాల్గొన్నారు.







The Star Cricket Club team, 1989, at the Lord's cricket ground: Sachin-first row, fifth from left.

## భారత క్రికెట్ దిగ్గజం సచిన్ కు
# 'లార్డ్స్'లో అరుదైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ పరిణామంపై సచిన్ స్పందిస్తూ, ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని, చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన లార్డ్స్ మైదానంతో తనకున్న అనుబంధాన్ని, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "1983లో కపిల్ దేవ్ సారథ్యంలోని భారత జట్టు ప్రపంచకప్ గెలిచినప్పుడే నాకు లార్డ్స్‌తో తొలి పరిచయం ఏర్పడింది. బాల్కనీలో కపిల్ ట్రోఫీని అందుకోవడం చూశాను. ఆ క్షణమే నా క్రికెట్ ప్రయాణానికి నాంది పలికింది" అని సచిన్ ఉద్వేగంగా చెప్పారు. తనను క్రికెటర్‌గా తీర్చిదిద్దిన స్ఫూర్తిదాయక ఘట్టం జరిగిన చోటే తన చిత్రపటానికి స్థానం దక్కడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌ను సైతం సచిన్ లార్డ్స్ మైదానంలో సంప్రదాయ గంటను మోగించి ప్రారంభించిన విషయం తెలిసిందే. క్రీడాకారుడిగా ఎన్నో రికార్డులు నెలకొల్పిన సచిన్‌కు, ఇప్పుడు లార్డ్స్ మ్యూజియంలో చిత్రపటం రూపంలో శాశ్వత స్థానం లభించడం ఆయన కీర్తికిరీటంలో మరో కలికితురాయిగా నిలిచింది. ఇవాళ భారత్, ఇంగ్లండ్ మధ్య లార్డ్స్ లో మూడో టెస్టును సచిన్ గంట మోగించి లాంఛనంగా ప్రారంభించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై
# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం...

(మొదటిపేజీ తరువాయి)

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకోసం 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రంలో కులగణన ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మంత్రివర్గ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్‌లకు ప్రైవేట్ యూనివర్సిటీ హోదా కల్పిస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందని పొంగులేటి వివరించారు. ఈ వర్సిటీలలో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని అన్నారు. 17 వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ సిద్ధంగా ఉందని, మార్చి నాటికి లక్ష ఉద్యోగాలు ఇచ్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ఇప్పటివరకు 19 కేబినెట్ సమావేశాలు నిర్వహించి, 321 అంశాలకు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది.

# వాళ్లను భర్తీ చేయడం ఏఐ వల్ల కూడా కాదు

కృత్రిమ మేధ (ఏఐ) రాకతో ఉద్యోగ భద్రతపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రోగ్రామింగ్ ఉద్యోగాలకు వచ్చే వందేళ్ల వరకు ఏఐ నుంచి ఎలాంటి ముప్పు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కృత్రిమ మేధ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదని, కేవలం ఒక సహాయకారిగా మాత్రమే పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. బిల్ గేట్స్ మాట్లాడుతూ, "ప్రోగ్రామింగ్‌లో డీబగ్గింగ్ వంటి కొన్ని బోరింగ్ పనుల్లో ఏఐ మనకు సాయం చేస్తుంది. అంతేగానీ, మన స్థానాన్ని పూర్తిగా భర్తీ చేయదు. క్లిష్టమైన సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు కనుగొనడమే ప్రోగ్రామింగ్‌లో అసలైన సవాలు. యంత్రాలు దానిని చేయలేవు. కోడింగ్‌కు విచక్షణ, ఊహాత్మక ఆలోచనా ధోరణి, పరిస్థితులకు తగ్గట్లు సర్దుబాటు కావడం వంటి లక్షణాలు అవసరం. ఈ సామర్థ్యాలు ఏఐలో లోపించాయి" అని వివరించారు. కోడింగ్ రాయడం అంటే కేవలం టైప్ చేయడం కాదని, దాని వెనుక లోతైన ఆలోచన, మానవ మేధస్సు ఉంటాయని ఆయన తెలిపారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనాలపైనా బిల్ గేట్స్ స్పందించారు. 2030 నాటికి ఏఐ వల్ల ప్రపంచవ్యాప్తంగా 8.5 కోట్ల ఉద్యోగాలు పోయే అవకాశం ఉండగా, అదే సమయంలో 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు కూడా సృష్టించబడతాయని ఫోరమ్ పేర్కొంది. ఈ విషయంపై గేట్స్ మాట్లాడుతూ, ఏఐతో ముప్పు పొంచి ఉందనే విషయంలో తనకూ కొంత ఆందోళన ఉందని అంగీకరించారు. అయితే, కృత్రిమ మేధను తెలివిగా వినియోగించుకుంటే మన ఉత్పాదకత పెరగడమే కాకుండా, మరింత ఖాళీ సమయం కూడా లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలోనూ కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ వంటి రంగాలకు ఆటోమేషన్ ముప్పు తక్కువని ఆయన అంచనా వేసిన విషయం తెలిసిందే.

# ఎంతో థ్రిల్లింగ్ గా ఉంది... ఏపీలో ఇది ఫస్ట్ స్మార్ట్ కిచెన్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా, టెక్నాలజీని జోడించి రాష్ట్రంలోనే మొట్టమొదటి 'స్మార్ట్ కిచెన్'ను కడపలో ప్రారంభించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడిస్తూ, ఎంతో థ్రిల్లింగ్ గా ఉందంటూ ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేశారు. కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఈ అత్యాధునిక స్మార్ట్ కిచెన్‌ను ఏర్పాటు చేసినట్లు లోకేశ్ తెలిపారు. దీని ద్వారా కేంద్రీకృత విధానంలో ప్రస్తుతం 12 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 2,200 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన, వేడివేడి భోజనాన్ని అందిస్తున్నారని వివరించారు. ఈ స్మార్ట్ కిచెన్ ప్రత్యేకత టెక్నాలజీ వినియోగమేనని ఆయన పేర్కొన్నారు. వంట చేసే దగ్గర నుంచి విద్యార్థులకు పంపిణీ చేసే వరకు ప్రతి దశను ఒక ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా పర్యవేక్షిస్తారని చెప్పారు. దీనివల్ల భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయవచ్చని, విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ కూడా సేకరించడం సులభమవుతుందని అన్నారు. ప్రస్తుతం ఉన్న బడ్జెట్ పరిధిలోనే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుండటం విశేషమని లోకేశ్ ప్రశంసించారు. త్వరలోనే మరో నాలుగు స్మార్ట్ కిచెన్లు నిర్మాణ దశ పూర్తి చేసుకోనున్నాయని, ఈ నూతన విధానం ద్వారా పిల్లలకు మరింత గౌరవంగా, జవాబుదారీతనంతో పౌష్టికాహారం అందించవచ్చని తెలిపారు. ఈ వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను, జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు.

## ట్రంప్‌ను టార్గెట్ చేస్తాం..
# ఫ్లోరిడాలోనూ వదలం: ఇరాన్ తీవ్ర హెచ్చరిక

* ఇరాన్ సుప్రీంలీడర్ సలహాదారు జావద్ లారిజాని వ్యాఖ్యలు
* సులేమానీ హత్యకు ప్రతీకారంగానే ఈ వ్యాఖ్యలు
* ట్రంప్‌పై బౌంటీ కోసం 27 మిలియన్ డాలర్ల నిధుల సేకరణ
* బెదిరింపులను తీవ్రంగానే పరిగణిస్తున్నట్టు ట్రంప్ వెల్లడి



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్ నుంచి తీవ్రస్థాయిలో బెదిరింపులు ఎదురయ్యాయి. ఫ్లోరిడాలోని ఆయన నివాసంలో సన్‌బాత్ చేస్తున్న సమయంలో డ్రోన్‌తో దాడి చేసి లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు హెచ్చరించడం కలకలం రేపుతోంది. ఇటీవల ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో ఈ బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సలహాదారు జావద్ లారిజాని స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. "ట్రంప్‌నకు ఫ్లోరిడాలోని మార్ ఎ లాగో రిసార్ట్ కూడా ఇక ఏ మాత్రం సురక్షితం కాదు. ఆయన సన్‌బాత్ చేస్తుండగా డ్రోన్‌తో లక్ష్యంగా చేసుకోవడం మాకు చాలా సులభమైన పని" అని ఆయన హెచ్చరించారు. 2020లో ఇరాన్ టాప్ జనరల్ ఖాసిం సులేమానీ హత్య వెనుక ట్రంప్ హస్తం ఉందని ఇరాన్ ఆరోపిస్తోంది. దీనికి ప్రతీకారంగానే ఈ హెచ్చరికలు చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు, 'బ్లడ్ పాక్ట్' అనే ఓ ప్లాట్‌ఫామ్ ట్రంప్‌పై బౌంటీ ప్రకటించి నిధులు సేకరించడం గమనార్హం. ఈ నెల 8 నాటికి ఈ ప్లాట్‌ఫామ్‌లో సుమారు 27 మిలియన్ డాలర్లు పోగయ్యాయి. ఇరాన్ శత్రువులపై ప్రతీకారం తీర్చుకోవడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తుంది. ఈ హత్యాయత్నం బెదిరింపులపై ట్రంప్ స్పందించారు. ఇరాన్ అధికారి వ్యాఖ్యలను ముప్పుగా భావిస్తున్నారా అని మీడియా ప్రశ్నించగా "అవును, నేను ఈ వ్యాఖ్యలను ముప్పుగానే భావిస్తున్నా. అది నిజమో కాదో తెలియదు, కానీ కావచ్చు" అని బదులిచ్చారు. చివరిసారిగా ఎప్పుడు సన్‌బాత్‌కు వెళ్లారని అడగ్గా, నవ్వుతూ తన ఏడేళ్ల వయసులో అని, ఆ తర్వాత తనకు అంతగా ఇష్టం ఉండదని సమాధానమిచ్చారు. ప్రస్తుతం టెహ్రాన్ చర్చలకు రావాలని అమెరికా పిలుపునిస్తుండగా, ఈ బెదిరింపుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత ముదిరే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయంపై ఎమ్మెల్సీ కవిత హర్షం

* స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
* తెలంగాణ కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన ఎమ్మెల్సీ కవిత
* చట్ట సవరణ తర్వాతే ఎన్నికలు జరపాలని ప్రభుత్వం నిర్ణయం
* ఇది బీసీల విజయమని అభివర్ణించిన కవిత
* తెలంగాణ జాగృతి పోరాట ఫలితమేనని వెల్లడి
* వెంటనే చర్యలు ప్రారంభించాలని ప్రభుత్వానికి సూచన





తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. ఈ మేరకు గురువారం ఆమె 'ఎక్స్' వేదికగా తన స్పందనను తెలియజేస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాన్ని సవరించి బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ వైఖరిని ఆమె ప్రశంసించారు. ఈ దిశగా అవసరమైన చర్యలను ప్రభుత్వం తక్షణమే ప్రారంభించాలని ఆమె కోరారు. ఈ నిర్ణయం తెలంగాణలోని బీసీల విజయమని కవిత అభివర్ణించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ జాగృతి సంస్థ మొదటి నుంచి బలంగా డిమాండ్ చేస్తోందని, కేబినెట్ తాజా నిర్ణయం తమ పోరాటానికి లభించిన స్పష్టమైన విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా కవిత జై బీసీ, జై జాగృతి అనే నినాదాలను తన ట్వీట్ కు ట్యాగ్ చేశారు.

# సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతున్నా ప్రింట్ మీడియా విలువ తగ్గలేదు

*** టి యూ డబ్ల్యూ జే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీద బాల్ రాజు**






శామీర్ పేట, (ప్రజాస్ఫూర్తి) : సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతున్నా ప్రింట్ మీడియా విలువ తగ్గలేదని పత్రికల విలువ శాశ్వతంగా ఎప్పుడు ఉంటుందని టి యూ డబ్ల్యూ జే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీద బాల్ రాజు అన్నారు. ఉమ్మడి శామీర్ పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడు క్యాతం రవి ఆధ్వర్యంలో బుధవారం శామీర్ పేట ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయా ప్రారంభోత్సవ మహోత్సవం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగామేడ్చల్ జిల్లా టీ యూ డబ్ల్యూ జే అధ్యక్షులు గడ్డమీది బాలరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి లు హాజరై మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, శామీర్ పేట ఎస్ హెచ్ ఓ శ్రీనాథ్, జీనోమ్ వ్యాలీ ఎస్ హెచ్ ఓ వెంకటరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి, జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిలి జైపాల్ రెడ్డిలతో కలిసి ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీ యూ డబ్ల్యూ జె జిల్లా అధ్యక్షులు బాలరాజ్ మాట్లాడుతూ ఉమ్మడి శామీర్ పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షులు క్యాతం రవికి, కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. శామీర్ పేట ఎస్ హెచ్ ఓ శ్రీనాథ్ మాట్లాడుతూ.... ప్రెస్ క్లబ్ అనేది ఫోర్త్ ఎస్టేట్ అని రాజ్యాంగంలో కూడా మీడియా పాత్ర గురించి ప్రస్తావించారని సమాజంలో ఏం జరుగుతుందో తెలువాలంటే విలేకరుల పాత్ర లేకుండా అది సాధ్యం కాదని ప్రతి రంగంలో మనుషులు పొరపాట్లు జరుగుతాయని శృతి మెత్తగా వాటిని పరిష్కరించుకోవాలని అన్నారు నూతన కమిటీకి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు అంతేగాక పోలీస్ వ్యవస్థను డిమాండ్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అన్నారు. జీనం వ్యాలీ ఎస్హెచ్ఓ మాట్లాడుతూ సమాజంలో మీడియా అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుందని ప్రపంచంలో ఎక్కడ ఏ సమస్య జరిగిన ప్రపంచానికి తెలియజేసే ఇదే మీడియాని నిజం నిర్భయంగా వెలికి తీసేది మీడియాని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ నా మిత్రుడు కేతమురవి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కావడం చాలా సంతోషంగా ఉందని ప్రభుత్వం తరఫున విలేకరులకు ప్రెస్ క్లబ్ కు ఏం కావాలన్నా నా వంతు సహకారం ఉంటుందన్నారు. జిల్లా ఆర్టిఏ నెంబర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మీడియా తన వంతు పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రెస్ క్లబ్ కార్యాలయానికి స్థలం కేటాయించడానికి తన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేను వివిధ స్థాయిల్లో ఎదగడానికి సహకరించిన మీడియాకు విలేకరులందరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ షామీర్పేట విలేకరులు అందరితో మమేకమై విలువలతో కూడిన జర్నలిజం చేయడంలో ఉమ్మడి శామీర్పేట మండలం విలేకరులు ముందు ఉంటారని వేరే ప్రాంతం విలేకరులకు ఇక్కడి విలేకరులకు చాలా వ్యత్యాసం ఉంటుందని అన్నారు అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా విలేకరులు తన కలంతో ప్రపంచానికి తెలంగాణ సమస్య ఏర్పాటు వాదం గురించి తెలియజేశారని అన్నారు అదేవిధంగా అధికారుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకెళ్తే తొందరగా పరిష్కారం అవుతాయని ఎదుగుతున్న లీటర్ల కూడా మీ ప్రోత్సాహం కావాలని అన్నారు. యువ నాయకులు క్యాతం మధు కృష్ణ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి ప్రెస్ క్లబ్ కు 20 కుర్చీలు కావాలంటే ఇవ్వడం జరిగిందని అదేవిదంగా ప్రెస్ క్లబ్ కు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తానని అన్నారు. కాళోజీ అన్నట్టు మహాకవి కాళోజి గారు అన్నట్టు ఒక అక్షరం సిరా చుక్క 100 మెదళ్లకు సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్పేట మండలం టిఆర్ఎస్ అధ్యక్షులు సరసం మోహన్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ గౌడ్ శామీర్పేట డిఐ రాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇంటలిజెన్స్ రవీందర్, ఏ ఎం సి డైరెక్టర్ శ్వేత, కాంగ్రెస్ నేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాప్రాలో ఫోకస్ ఫోటోగ్రఫీ అసోసియేషన్ సమావేశం



ప్రజాస్ఫూర్తి , కాప్రా :కాప్రా ప్రాంతంలోని ఫోకస్ ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సంఘానికి చెందిన ముఖ్య నాయకులు, ప్రముఖ ఫోటోగ్రాఫర్లు, స్టూడియో ఓనర్లు, ల్యాబ్ ప్రతినిధులు సమావేశమై, విభిన్న అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా గత కొంతకాలంగా ముడి సరుకుల ధరలు, ప్రింటింగ్ ఖర్చులు, వేతన భారం పెరిగిన నేపథ్యంలో ఫోటోగ్రఫీ సేవల ధరలు (రేట్లు) సవరించాల్సిన అవసరం ఉన్నదని సభ్యులు అభిప్రాయపడారు. అందుకు అనుగుణంగా అన్ని వర్గాల సభ్యులు సమ్మతిస్తూ, పెరిగిన రేట్లను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఫోటోగ్రఫీ రంగంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు, వినియోగదారులకు సరైన సేవలతో పాటు ఫోటోగ్రాఫర్లకు న్యాయమైన పారితోషికం అందాల్సిన అవసరం గురించి నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడు సతీష్ , కార్యదర్శి నరేష్, కోశాధికారి శివ నారాయణ, కన్నా, రాజు, మధన్ కుమార్, రవి గౌడ్, సంతోష్, యాకయ్య, మధు గౌడ్, గణేష్, నాని, సాయి, సత్యనారాయణ, ఇతర ముఖ్య సభ్యులు పాల్గొన్నారు. ప్రాంతంలోని అనేక స్టూడియోలు, ల్యాబ్‌లు, ఫ్రీలాన్స్ ఫోటోగ్రాఫర్లు సమావేశంలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలన



ఆలేరు, ప్రజాస్ఫూర్తి : ఆలేరు మండలంలోని సారాశిపేట గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలను గురువారం మహిళా కాంగ్రెస్ పార్టీ మండల మహిళ నాయకురాలు దూడల అనిత సందర్శించి హై స్కూల్ లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం, అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై ఏదైనా సమస్యలు ఉన్నాయా, విద్యార్థులకు శుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం అన్నారు ఆలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మనికేశ్వరి మాత ఆలయంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం జగద్గిరి గుట్ట కొండపైన ఉన్న మనికేశ్వరి మాత ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జే.కె. శేఖర్ యాదవ్, మాజీ ఎంపిపి చంద్ర శేఖర్ యాదవ్, ప్రధాన అర్చకులు మల్లికార్జున్, ఎలక్షన్ రెడ్డి , విట్టల్ రెడ్డి ,, శ్రీకాంతాచార్యులు, మహిపాల్ రెడ్డి , శ్రీకాంత్ యాదవ్ , బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ సైబర్ వారియర్‌కు రాచకొండ కమిషనర్ ప్రశంస

*** సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన మహిళా కానిస్టేబుల్‌కు రివార్డ్ ప్రదానం**




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ భాగంగా, ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు రాచకొండ కమిషనర్ జి. సుదీర్ బాబు ఆదేశాల మేరకు ఎల్బీనగర్ పోలీస్ శాఖ అద్భుత కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.ప్రతి రోజు ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తత , అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరస్తులు ఉపయోగించే మోసపూరిత పద్ధతులు, లోన్ యాప్స్, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాలు మొదలైన వాటిపై ప్రజలకు వివరంగా తెలియజేస్తున్నారు. ఇలా చేస్తున్న అభినవ ప్రచారానికి రాచకొండ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా ప్రశంసలు తెలియజేశారు.ఈ నేపథ్యంలో, ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వైష్ణవి అనే మహిళా కానిస్టేబుల్ చేసిన అవగాహనా కార్యక్రమాలు సీపీ దృష్టికి వెళ్లడంతో, ఎల్బీనగర్ క్యాంప్ కార్యాలయంలో ఆమెను పిలిపించుకొని స్వయంగా రివార్డ్ అందజేయడం జరిగింది.వైష్ణవి అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసి, 2024 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ బ్యాచ్‌లో పోలీస్ శాఖలో చేరారు. సైబర్ అవగాహన రంగంలో ఆమె చూపుతున్న నైపుణ్యం, ప్రతిబద్ధత సాఫ్ట్వేర్ ఉద్యోగుల స్థాయిలో ఉందని, యువతీ యువకులకు ఆదర్శంగా నిలుస్తారని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం రాచకొండ కమిషనరేట్‌లో పోలీసింగ్‌తో పాటు ప్రజలకు సేవలో కూడా మహిళా పోలీసుల పాత్ర ఎంత ముఖ్యమైనదో మరోసారి చాటిచెప్పింది.



## డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టండి

*** విద్యాసంస్థల ముందు సిగరెట్ గుట్కా విక్రయాన్ని ఆపండి**

*** ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కే,ఫహీమ్ దాదా**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అఖిల భారత యువజన సమైక్య ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల ముందు విక్రయిస్తున్న గుట్కా, సిగరెట్, పాన్ పరాగ్ వివిధ మత్తు ద్రవ్యాలను విక్రయించకుండా చూడాలని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కే,ఫహీమ్ దాదా మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టాలని యువజన విద్యార్థులకు పిలుపునిచ్చారు, అదేవిధంగా విద్యాసంస్థల ముందు సిగరెట్స్, గుట్కా పాన్ పరాక్ వంటి మత్తు ద్రవ్యాలను విక్రయించడం వల్ల విద్యార్థులు తెలిసి తెలియని వయసులో వాటికి ఆకర్షితులై జీవితాలను ఆగం చేసుకుంటున్నారని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యాసంస్థల ముందు అమ్ముతున్న షాపులపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఇష్టానుసారంగా, బస్తీలలో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగిపోయాయని 24 గంటలు బెల్టు షాపుల్లో మద్యపానం విక్రయిస్తూ యువత జీవితాలతో ఆటలాడుకుంటూ యువతకు భవిష్యత్తు లేకుండా చేస్తున్న బెల్టు షాపులను తొలగించాలని ఈ దేశ భవిష్యత్తు విద్యార్థి యువకులేని వారిని చెడు మార్గంలో పోనియకుండా ఆపే బాధ్యత మనందరిపై ఉందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యుమ్, ఉపేందర్, సురేష్, రణధీర్, బానోత్ శ్రీను, వంశీ, తదితరులు పాల్గొన్నారు

## పవిత్రమైన గీతవృత్తికి కళంకం తెచ్చే నకిలీ వ్యాపారుల పనిపట్టాలి”

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : గీత కార్మికుల ముసుగులో నకిలీలు కళ్ళు దందాలకు పాల్పడుతూ కోట్ల రూపాయలు అక్రమంగా దోచుకుంటున్నారు పేద మధ్యతరగతి ప్రజల కు కల్తీ కల్లు విక్రయిస్తూ జీవితాలతో ఆడుకుంటున్నారు . ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేటు , డైజోఫాం ,సిట్రస్ యాసిడ్ లాంటి రసాయనాలను నగర శివారు పారిశ్రామిక వాడలలోని కొన్ని పరిశ్రమల నుంచి చాటుగా కొనుగోలు చేసి కల్తీ కల్లు తయారీకి ఉపయోగిస్తున్నారు . ఈ దందాలు తెలిసి కూడా సంబంధిత అధికారులు లంచాలకు మరిగి ఈ కల్తీ వ్యాపారాన్ని నిర్మూలించకపోవడంతో ఎన్నో కుటుంబాలు అనారోగ్యాలు బారిన పడి ఆర్థికంగా చితికి పోతున్నాయి



. ఇప్పటికైనా నకిలీ గీత కార్మికుల ఆగడాలను అరికట్టకపోతే మునుముందు మరెన్నో ఘోరాలను చూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాము. ముఖ్యంగా ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ నకిలీ గీత కార్మికుల కు తాటి చెట్టు ఎక్కి కల్లు తీసే పరీక్షలు పెట్టి అనర్హుల కల్లు దుకాణం లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము . అర్హులైన గీత కార్మికులను గుర్తించి వారికి దుకాణం లైసెన్సులు మంజూరు చేయాలని కోరుతున్నాము . మాయదారి కల్లు మాఫియా నిర్వహిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం . పవిత్రమైన గీత వృత్తికి కళంకం తీసుకొస్తున్న వారి ఆటలు సాగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం . హైదరాబాద్ అడ్డగా కల్లు మాఫియా నిర్వహిస్తూ ప్రమాదకరమైన రసాయనాలను మన తెలుగు రాష్ట్రాల్లో నే కాకుండా మహారాష్ట్ర ,మధ్యప్రదేశ్ , రాజస్థాన్ మరికొన్ని రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి దుర్మార్గమైన వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతున్నాను.

## బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ ఆకస్మికంగా పరిశీలన



ప్రజాస్ఫూర్తి , కాప్రా : చర్లపల్లి డివిజన్‌లోని శివ సాయి నగర్ నుండి డిమార్ట్ వరకు రూ. ఒక కోటి ఎనబయి లక్షల రూపాయల వ్యయంతో నిర్మించబడుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆకస్మికంగా సందర్శించి పనుల నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్శన సందర్భంగా ఆమెతో పాటు జి హెచ్ ఎమ్ సి. డి ఈ. బాలకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు. అధికారులకు ఆమె పలు సూచనలు చేస్తూ, పనులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగించాలన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తయ్యాక చుట్టుపక్కల కాలనీలు వరద ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండేందుకు ఈ డ్రెయిన్ నిర్మాణం ఎంతో అవసరం అని పేర్కొన్నారు.

## అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ముస్తాబాద్ అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేకే మహేందర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని వేడుకున్నారు. అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు, సీట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల మహేష్ రెడ్డి, నక్క ప్రశాంత్, చింతాజీ వరుణ్, హర్షవర్ధన్ తదితరులున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు వైద్య సిబ్బంది రానున్నారు..




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కలెక్టర్ జితేష్ వి సూచన మేరకు. సికెల్ సెల్ టెస్టింగ్ నిమిత్తం మండలంలో గల సకల ప్రభుత్వ పాఠశాలలకు వైద్య సిబ్బంది రానున్న మేరకు. అట్టి కార్యక్రమ నిర్వహణ నిమిత్తం అవసరమగు డేటా షీట్లను డిక్లరేషన్ పత్రాలను పాఠశాలల వారీగా గురువారం కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ ఆయా హెడ్ మాస్టర్లు , ప్రిన్సిపాల్స్ కు అందజేస్తూ, సికెల్ సెల్ టెస్టింగ్ డేటా సేకరణ తదితర విద్యా విధానాల గూర్చి పూర్తిగా విశ్లేషించారు. భర్తీ చేసిన ప్రొఫార్మాలను డిక్లరేషన్లతో ఎం ఈ ఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు, సెక్రటరీలు, సీఆర్పీలు, ఎం ఆర్ సి స్టాఫ్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# వెంకటేశ్వర నగర్ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : వెంకటేశ్వర నగర్ కాలనీలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ తిరుమల నగర్ ఆధ్వర్యంలో, లయన్ ఎమ్. సురేష్ గౌడ్ సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో ఉచితంగా కంటి పరీక్షలు, డెంటల్ పరీక్షలు, ఆకుపంక్చర్ వైద్య సేవలు నిర్వహించారు. అలాగే అవసరమైన వారికి ఎమ్ ఎస్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 1:00 గంటకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ ఎన్నా రెడ్డి, గవర్నర్, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320C హాజరయ్యారు. అతిథులుగా మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె. కృష్ణారెడ్డి రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎమ్. సురేష్ కుమార్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జె. ప్రభుదాస్, బీజేపీ డివిజన్ అధ్యక్షులుఎమ్. రామ్ ప్రదీప్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు పి. అంజయ్య,జెడ్ సి. పి. మురళీ కృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ తిరుమల నగర్ అధ్యక్షులు ఎమ్. ప్రభాకర్ చారి, కార్యదర్శి డి. చంద్రశేఖర్, కోశాధికారి పి. నవీన్ యాదవ్, డా. శ్రీనివాస్, ఎస్. మురళీ చారి, యెన్. రమేష్, మహేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## గురు పౌర్ణమి అభినందన మహదానందం

*** ఎన్‌ఎఫ్సీ రిటైర్డ్ సీఈఓ కంభంపాటి బలరామమూర్తి.**



ప్రజాస్ఫూర్తి , కాప్రా :అణు ఇంధన సంస్థ ఎన్‌ఎఫ్సీలో సేవలందించి పదవి విరమణ పొందిన తనను గురు పౌర్ణమి సందర్భంగా శివ సాయి నగర్ కుటుంబాల సముచిత సత్కారం మహదానందంగా ఉందని ఎన్‌ఎఫ్సీ రిటైర్డ్ సీఈవో సీనియర్ సైంటిస్ట్ కంభంపాటి బలరామమూర్తి సంతోషం వ్యక్తం చేశారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం రోజు శివ సాయి నగర్ శివ సాయి దేవాలయ సమావేశ మందిరంలో ఎన్‌ఎఫ్సీ రిటైర్డ్ సీఈఓ బలరామమూర్తి ని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ కుటుంబాలు, భక్తులు, కమిటీ సభ్యులు చూపిన అభినందన జీవితకాలం తన మదినిండా మెదులుతూనే ఉంటుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మా రెడ్డి, శివ సాయి నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొండగల్ల అశోక్, చక్రపాణి, శ్రీరాములు, రమేష్ రావు,ఆష్టం కృష్ణారెడ్డి, బాణాల రామకృష్ణారెడ్డి, షాబాద్ దామోదర్ రెడ్డి, వల్లభనేని శ్రీనివాస గాంధీ, మహేష్ కుమార్, సత్యనారాయణ రెడ్డి, బత్తుల రాజిరెడ్డి, సరికొండ రమేష్, సత్యనారాయణ, నిర్మల నాందేవ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలతో కూడిన ప్రమోషన్ షెడ్యూల్ ను వెంటనే విడుదల చేయాలి

*** తపస్ రాష్ట్ర కార్యదర్శి సి.వి.శ్రీనివాస్**



రాజాపేట , ప్రజా స్ఫూర్తి : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాజపేట మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి సివి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వము 2023 నుండి రావాల్సిన పిఆర్సిని వెంటనే కమిషన్ నుండి నివేదిక తెప్పించుకొని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐదు డి.ఏ లు పెండింగ్ లో ఉండడం అనేది చాలా బాధాకరమైన అంశమని వెంటనే డి.ఎ లు కూడా ప్రకటించాలి అని డిమాండ్ చేశారు. జేఏసీ లో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన మేరకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులను కేంద్ర ప్రభుత్వం (సీజి హెచ్ ఎస్) మాదిరిగా అమలు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలము జీతం చెల్లించి మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పలుగుల రాజు, మండల గౌరవాధ్యక్షులు నమిలే భరత్ కుమార్ గౌడ్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుదుకు జానయ్య , పున్న సత్యానంద్ మండల ఆర్థిక కార్యదర్శి బి. బాలరాజు తదితరులు పాల్గొన్నారు..

## పలువురు ప్రముఖులకు ఘన సత్కారం



రాజాపేట ,ప్రజా స్ఫూర్తి : రాజపేట మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యకులు మేకల రమేష్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన గురు పూర్ణిమ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంఈఓ చందా రమేష్ , రిటైర్డ్ ఎంఈఓ బల్ల దామోదర్, భవిత సెంటర్ ఐ ఈ ఆర్ టి సంధ్యారాణి , సేంద్రీయ వ్యవసాయం చేస్తూ 107 సార్లు రక్తదానం చేసి 37 సార్లు ప్లేట్లెట్స్ ఇచ్చి తెలంగాణలో మొదటి వ్యక్తిగా ఎంతోమందికి రక్తదానం చేసిన మేక వెంకట్ రెడ్డి , చిందు కళాకారులు పిల్లుట్ల ముకుందము , హరిదాసు కీర్తన కళాకారులు తండ్రి వృత్తి వారసత్వం కొనసాగిస్తున్న రేపాక భాగ్యలక్ష్మి , రాష్ట్ర ఉత్తమ అర్చక స్వామి అవార్డు గ్రహీత చలివెందుల రామకృష్ణ శర్మ లకి సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో తాజా మాజీ ఎంపిటిసి దాచేపల్లి రాజు, రాజపేట పట్టణ అధ్యక్షులు సాధనబోయిన శంకర్, మండల ప్రధాన కార్యదర్శి మెండు భవన్ రెడ్డి ,పారుపల్లి సంజీవ రెడ్డి, మెండు మనీకుమార్ రెడ్డి, ఉప్పరి మల్లేశము, భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మూడో విడత ఉచిత రాత పుస్తకాల పంపిణీ



ప్రజాస్ఫూర్తి , కాప్రా : వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆధ్వర్యంలో దాతల సహకారంతో వంపుగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో రాత పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుమూల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిధి గా విచ్చేసినారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్తా, కార్యనిర్వాక కార్యదర్శి గంప కృష్ణ గుప్తా, సహకరించిన దాతలు పెద్ది నాగరాజు గుప్తా, అమర కృష్ణ గుప్తా, అనుములు నర్సింగ్ రావు గుప్త, బచ్చు నగేష్ గుప్తా, రాయల శ్రవణ్ కుమార్ గుప్తా, రాయికంటి ముత్యాల గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, చందా సంతోష్ గుప్తా, కూర శ్రీనివాస్ గుప్తా, ఎనిశెట్టి మురళి గుప్తా, వి బి వి కృష్ణ గుప్తా, వై వి యు నాగేశ్వరరావు గుప్తా, మాచర్ల హనుమంతరావు గుప్తా, లింగా రామచంద్ర గుప్తా, చంద్రగిరి తారకేశ్వర్ గుప్తా, బెల్దే భగవాన్ గుప్తా, దిడిగం కైలాసం గుప్తా, రాయల సంతోష్ గుప్తా, అర్ధం శ్రీనివాస్ గుప్తా, జగ్గయ్య గారి బాలలింగం గుప్త, రాజూరి జగదీష్ గుప్తా, బిల్దే నాగరాజు గుప్తా, సముద్రాల హరినాథ్ గుప్త, ఉపాధ్యక్షులు కార్యదర్శి బాచెల్లి నవీన్ గుప్తా, కార్యవర్గ సభ్యులు సభ్యులు కండే శివగుప్త రాజకీయ నాయకులు కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్, చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్పాల్ రెడ్డి,అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

*** ఉపాధ్యాయులను సన్మానించిన ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు:గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఇల్లందు ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్గదర్శిని హై స్కూల్, మెయిన్ రోడ్ హై స్కూల్, ప్రియదర్శిని హై స్కూల్‌లలో ఉపాధ్యాయ వృత్తిలో సేవలందిస్తున్న ఉపాధ్యాయినీలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకురాలు పుల్లూరు జ్యోతి మాట్లాడుతూ గురువులు సమాజ నిర్మాణంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులకు శ్రద్ధ, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలతో కూడిన నైతిక జీవనవిధానాన్ని నేర్పిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. ఇలాంటి మహత్కార్యాన్ని నిర్వహిస్తున్న ప్రతి గురువుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం సభ్యులు కండె సావిత్రి, పొద్దుటూరి మణి, అర్వపల్లి విజయలక్ష్మి, యెలుగూరి జయశ్రీ, మహాసభ పట్టణ, మండల, యువజన సంఘం అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, కండె రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్,యెలుగూరి మధుబాబు, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల వరకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలి

*** యాదగిరిగుట్ట బీజేపీ పట్టణ అధ్యక్షులు కర్ర ప్రవీణ్**

యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్టీసీ డిపో ముందు బీజేపీ ఆధ్వర్యం లో ధర్నా నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి పట్టణ అధ్యక్షులు కర్ర ప్రవీణ్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణంలో ఉన్నటువంటి ప్రభుత్వ బాలికల వసతి గృహం నుండి ప్రభుత్వ పాఠశాల వరకు గతంలో ఆర్టీసీ బస్సు సదుపాయం ఉండేది అయితే ఆర్టీసీ డిఎం మారిన తర్వాత ఆ యొక్క విద్యార్థినిలు పాఠశాల వరకు సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లడం జరుగుతుంది. రాను పోను నాలుగు కిలోమీటర్లు అయితుందని విద్యార్థినిలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు దీని గురించి ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేకపోవడంతో ఈరోజు ఆర్టీసీ డిపో ముందు బిజెపి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడం జరిగింది డిపో మేనేజర్ తో ఫోన్లో మాట్లాడగా ఆయన కూడా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు ప్రభుత్వం ఏమో ప్రభుత్వ స్కూల్లోనే పిల్లల చదువుకోవాలని చెప్పి ప్రోత్సాహకాలు ఇస్తుంటే ఇక్కడ ఉన్నటువంటి అధికారులు మాత్రం దానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. కావున తక్షణం ఆ యొక్క విద్యార్థినులకు బస్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు వినతి



పత్రం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కార్యదర్శికాదూరి అచ్చయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుంటుపల్లి సత్యం ,ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్ గోపగాని ప్రసాద్ ఉపాధ్యక్షుడు గౌలికారు జవహర్ కార్యదర్శులు ఆలేటి కర్ణ,పలుగుల సురేష్ ,దొమ్మాట ప్రభాకర్ ,సీనియర్ నాయకులు తాళ్ల భాస్కర్ రెడ్డి బొమ్మగాని రాజమణి బెలిదే అశోక్ ,ఎరుకల చైతన్య ,సుదుగు రాజిరెడ్డి ,బోడా బుచ్చిబాబు ,వాల్మీకి అజయ్ ,ఆకుల దేవేందర్ ,సుధగాని శివ ,గాదె వంశీ ,కొన్ని ప్రశాంత్ ,ప్రవీణ్ ,భాను ,నవీన్ ,సంద ప్రవీణ్,వంగ శ్రీకాంత్ ,కర్రే శ్యామ్ ,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మట్టి తవ్వకాలు జరిపిన చర్యలు తప్పవు

*** టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ మట్టి తవ్వకాలు జరిపిన, రవాణా చేసిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామ శివారులో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వి తరలిస్తున్నరన్న సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 ట్రాక్టర్లు, జెసిబి స్వాధీనం చేసుకొని తదుపరి చర్యలు నిమిత్తం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా మట్టిని తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయాలంటే ముందస్తుగా సంబంధించిన శాఖ నుండి అనుమతి పొందాలని, లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలో ఎక్కడైనా అక్రమంగా మట్టిని తరలించినా, తవ్వకాలు చేసినా, నిల్వ చేసినా సమాచారం అందించాలని కోరారు.

## వయోవృద్ధుల మల్టీ డే కేర్ సెంటర్ కొరకు దరఖాస్తుల స్వీకరణ




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో వయోవృద్ధుల కొరకు మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ నడుపుటకు స్వచ్ఛంద సంస్థలు , సీనియర్ సిటిజన్ అసోసియేషన్ల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి జే.యమ్. స్వర్ణలత లెనిన తెలియజేశారు.మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ నిర్వహించే వారు తెలంగాణ సొసైటీ రిజిస్ట్రేషన్ 2001 లేదా ద కంపెనీస్ యాక్ట్ 1956 లేదా ఇండియన్ ట్రస్టు యాక్ట్ 1882 ద్వారా రిజిస్టర్ అయి ఉండాలి.ఎన్.జి.ఓ. లేదా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్ లేదా చిల్డ్రన్స్ హోమ్ లేదా షెల్టర్ హోమ్స్ నిర్వహించడంలో కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి.ఎన్జీవో లేదా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ బ్లాక్ లిస్టులో ఉండడం, ఫైనాన్సియల్ ఫ్రాడ్ కేసుల్లో ఉండటం వంటి దరఖాస్తులు తిరస్కరించబడును. ఆసక్తి గల ఎన్జీవో లేదా సీనియర్ సిటిజన్ అసోసియేషన్స్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ట్టుకొనుటకు దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ వారి కార్యాలయం, ఐ.డి.ఓ.సి. పాల్వంచ నందు ఈ నెల 15 వ తేదీ లోగా అందించవలసిందిగా పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము . వివరముల కొరకు 630 198 1960, 833 100 6010 నంబర్లను సంప్రదించగలరు.

## కల్లూరు రామచంద్రారెడ్డిపై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు ఆక్షేపనీయం

**: సట్టు తిరుమలేష్**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : బిఆరెస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆరోపణలను చేయడం పట్ల కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తూ రాజాపేట బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సమావేశం గురువారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుందని, ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ శ్వేత పత్రం విడుదల చేయాలని అడిగినందుకు గొంతు నొక్కే విధానాలు అవలంభిస్తున్నారన్నారు. విమర్శకు ప్రతి విమర్శలు మానేసి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మరొకసారి టిఆర్ఎస్ నాయకుల పైన ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల సెక్రెటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, మండల యువజన అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్, జల సాధన సమితి అధ్యక్షులు ఎర్రగోకుల జస్వంత్, పారుపల్లి మాజీ సర్పంచ్ బొంగోని ఉప్పలయ్య గౌడ్ ,ఎడ్ల రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు అంకతి సుదర్శన్, సోషల్ మీడియా అధ్యక్షుడు గంధమల్ల సురేష్, నర్సాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు ఎమ్మా భాస్కర్ రెడ్డి,రామిడి అశోక్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ మోత్కుపల్లి బాలకృష్ణ, గొల్లన రవి తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ మేరీస్ పాఠశాలలో వన మహోత్సవం

*** మొక్కలు నాటిన సిస్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వన మహోత్సవం అంటే 'వర్షాకాల పండుగ' అని అర్థం. ఇది భారతదేశంలో జూలై మొదటి వారంలో జరుపుకునే ఒక ప్రత్యేకమైన వారోత్సవం (సప్తాహం). ప్రకృతి పరిరక్షణకు సంబంధించిన చైతన్యాన్ని పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. గురువారం కొత్తగూడెంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని సెయింట్ మేరీస్ పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా పాఠశాల సిస్టర్ నిర్మల మాట్లాడుతూ వన మహోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణ చెట్లు ఎంతో దోహదం చేస్తాయని, గాలిలో ఉండే కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయని, చెట్లు వర్షాభావం నివారించడంలో, భూమి ఉష్ణోగ్రత తగ్గించడంలో సహాయపడతాయని చెప్పారు. చెట్లు, అడవులు ఎన్నో జంతువులకు ఆవాసాలుగా ఉన్నాయని, ఔషద మొక్కలు మానవుల ఆరోగ్యానికి మేలు చేస్తాయని, చెట్లు మనసుకు ప్రశాంతత కలిగిస్తాయి చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడంతోపాటు వాటి సంరక్షణ కూడా చేయాలని సూచించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, సిస్టర్స్, విద్యార్థులు, స్టాఫ్ మొక్కలను నాటారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని ప్రతిజ్ఞ చేయించారు. తరువాత పాఠశాల నుండి ప్రధాన రహదారి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.






*** సిస్టర్స్ కు మొక్కలు అందజేసిన నైనిక రజువా**

వన మహోత్సవం సందర్భంగా సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు పీఎం మోడీ మన్‌కి బాత్‌లో ప్రశంసలు అందుకున్న ప్రకృతి ప్రేమికులు, ప్రకృతి హరిత దీక్ష, గ్రీన్ మోటార్ వెహికిల్ గార్డెన్ వ్యవస్థాపకులు, సింగరేణియన్ కొట్టూరు నుర్వి రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్) సహాయ సహకారాలతో పలు మొక్కలను హరితదీక్షపరురాలు నైనిక రజువా చేతులమీదుగా సిస్టర్ నిర్మలకు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందచేశారు. హరితదీక్ష చేపట్టి పర్యావరణ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్న నైనిక రజువాను ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల , స్టాఫ్ అభినందించారు. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగవద్దు అని, స్టీల్ బాటిళ్లలో నీటిని తాగాలని, అదేవిధంగా ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని, క్లాత్ బ్యాగులు వాడాలని, ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలను నాటాలని ప్రకృతి హరిత దీక్ష పరురాలు నైనిక రజువా విజ్ఞప్తి చేశారు. వనమహోత్సవ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ పాఠశాల సిస్టర్ మేరీ జాన్, సిస్టర్ నిర్మల, ఉషా రాణి, సిస్టర్ బెనెడిక్టా, సిస్టర్ లిల్లీ డేనియల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పంచశీల పాఠశాలలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : గురు పౌర్ణమి సందర్భంగా గురువారం మూసాపేటలోని పంచశీల స్కూల్ లో గురు పూర్ణిమ వేడుకలు ఘరంగా జరిగాయి. భారత వికాస్ పరిషత్ కూకట్‌పల్లి శాఖ వారి ఆధ్వర్యములో స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులనీ సన్మానించి గౌరవించారు..ఈ కార్యక్రమములో అధ్యక్షుడు అనిల్ కుమార్ , ఐన్‌స్టీన్ అధినేత మోహన్ , పాఠశాల కరస్పాండెంట్ డి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి ) : గురుపౌర్ణమి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ నిర్మించిన శ్రీశ్రీశ్రీ షిరిడి సాయిబాబా వారి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి కాకడహరతి, గణపతి హోమం, హారతి పూజ, పల్లకి సేవా, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరికి డాక్టరేట్ పురస్కారం



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణా రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్రా అధ్యక్షులు, చైతన్య విద్యాసంస్థల చైర్మన్,కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరికి అరుదైన పురస్కారం లభించింది. చిక్కడపల్లి లోని త్యాగరాజ గాన సభలో హోప్ తియాలజికల్ ఇంటర్ నేషనల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రిటైర్డ్ జడ్జి మధుసూదనరావు పాల్గొని ఆయన చేతుల మీదుగా డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ విద్యావేత్త శివరాత్రి యాదగిరి చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి అమెరికా హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ నుండి "డాక్టర్ ఆఫ్ ది బెస్ట్ సోషల్ సర్వీస్" గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివరాత్రి యాదగిరి గాయకుడిగా దాదాపు 500 జానపద గాయాలను ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్ లో ఆలపించారన్నారు. దూరదర్శన్ గ్రేడ్ ఆర్టిస్ట్ గా ఎన్నికై టెలిస్కూల్లో గణితం, సైన్స్ పాఠాలు చెప్పారన్నారు. ఒక కవిగా,రచయితగా, సామాజిక సేవకుడిగా గత 35 సంవత్సరాల నుంచి సేవలు అందించినందుకు గాను వీరికి డాక్టరేట్ పురస్కారం దక్కిందని తెలిపారు. కరోన కాలంలో చాలామందికి నిత్యావసర వస్తువులతో పాటు దుస్తులను అందజేయడం జరిగిందని, ఆర్థికంగా కొంత మందికి సహాయపడటం జరిగిందన్నారు. విటన్నింటిని గుర్తించిన హోప్ యూనివర్సిటీ వీరికి అరుదైన పురస్కారం డాక్టరేట్ ను వారి యూనివర్సిటీ నుంచి అందజేసినట్లు తెలిపారు. ఈ గౌరవ డాక్టరేట్ స్వీకరించిన సందర్భంలోనూ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ తన స్కూల్ విద్యార్థుల పట్ల తమ సేవను కొనసాగిస్తూ, సామాజిక బాధ్యతగా చైతన్య స్కూల్‌లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రత్యేకంగా ఎంపిక చేసి, మేడివిజన్ సీసీఎస్ అనే ఆధునిక, మానసిక స్థైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాన్ని సోమ, మంగళ వారాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు భావోద్వేగాల నియంత్రణ, ఆత్మవిశ్వాసం, సమస్యల పరిష్కార నైపుణ్యం వంటి అంశాలపై ప్రత్యేకమైన మార్గదర్శనం లభించనుందన్నారు.





# మీ హామీలపై చర్చిద్దాం రండి

- **సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సవాల్**
- **పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ కి మహిళలు వస్తాం...**
- **ఇచ్చిన హామీలపై చర్చిద్దాం**
- **ఏపీ సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సవాల్ విసిరారు. "పదే పదే కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రంకెలు వేస్తున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారు. మేం మహిళలు అందరం మీ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు వస్తాం..మహిళలకు నెలకు రూ.2,500 ఎందుకు ఇస్తలేరో చర్చ చేద్దాం. కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ కింద తులం బంగారం ఇస్తలేరో, ఎందుకు పింఛన్లు పెంచడం లేదో చర్చిద్దాం" అని స్పష్టం చేశారు. కొత్తగూడెంలో గురువారం నిర్వహించిన తెలంగాణ జాగృతి విస్తృత సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరన్న తన అనుచరులతో కలిసి ఎమ్మెల్సీ కవిత సమక్షంలో తెలంగాణ జాగృతి లో చేరారు. ఆయనకు తెలంగాణ జాగృతి కండువాను కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.... తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి విస్మరిస్తోందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్లు సాధకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవడానికి ఈ నెల 17వ తేదీన రైల్ రోకో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతపరుస్తున్నామని తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కనీసం జై తెలంగాణ అనడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో పరిపాలన కుంటుపడిందని, సంపూర్ణ రైతురుణమాఫీ కాలేదనీ, ప్రజా సమస్యలపై చర్చకు రమ్మంటే సీఎం పారిపోయారని మండిపడ్డారు.ఆడబిడ్డలకు నెలకు 2,500 ఇస్తామని రేవంత్ రెడ్డి మాట తప్పారని తెలిపారు.సింగరేణిని రేవంత్ రెడ్డి పట్టించుకోవడంలేదనీ, సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు రావడం లేదని ప్రస్తావించారు. సింగరేణి బొగ్గు గనులను ప్రయివేటుపరం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రేవంత్ రెడ్డికి అవినీతి చక్రవర్తి,అసమర్థ ముఖ్యమంత్రి అనే బిరుదు ఇచ్చామని చెప్పారు. మహిళల పక్షాన జాగృతి పోరాటం చేస్తుందనీ స్పష్టం చేశారు. "కొత్తగూడెం జిల్లా అంటే పరిశ్రమలు ఉండే జిల్లా. ఐటీసీలో కాలుష్యం లేకుండా పరిశ్రమ యాజమాన్యం దృష్టి సారించాలి. స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని పునరుద్ధరణ చేయాలి." అని డిమాండ్ చేశారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేసిన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో తిరిగి కలపాలని కోరుతూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. "భద్రాచలం చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు ఆందోళనలో ఉన్నాయి. భద్రాచలం రాముడి భూములు పురుషోత్తపట్నంలో ఉన్నాయి.ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవ తీసుకోవాలి. తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం తర్వాత కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కు తుమ్మల ఐదు గ్రామ పంచాయతీలపై లెటర్ ఇచ్చారు. పురుషోత్తపట్నంలో ఉన్న రాముడి భూములను చూడటానికి వెళ్లిన రామాలయం ఈవోపై దాడి చేశారు. భద్రాచల రాముడు తెలంగాణ దేవుడు." అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆడబిడ్డ,బీసీ బిడ్డ భద్రాచలం రామాలయం ఈవో రమాదేవిపై జరిగిన దాడిని ఖండిస్తున్నట్లు ప్రకటించారు.సీతారామ ఎత్తిపోతల పథకం పనులు కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలోనే 70 శాతం పూర్తయ్యాయని.. మిగతా పనులు పూర్తి చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ప్రమాదకరంగా మారిన ట్రాన్స్ఫార్మర్ ను తొలగించాలని జోనల్ కమిషనర్కు వినతి






కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : సూరారం ఎక్స్ రోడ్ లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ ను తొలగించి పక్కకు ఏర్పాటు చేయాలని సామాజిక పర్యవరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. గురువారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ భారీ వాహనాలు కాలనీలకు వెళ్ళేటప్పుడు ట్రాన్స్ఫార్మర్ కు తగిలే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఓ సారి తగిలినట్లుగా తెలుస్తుందన్నారు.ఈ ప్రాంతంలో ఆర్టీసి బస్సు గాని, స్కూల్ బస్సు గాని ట్రాన్స్ఫార్మర్కు తగిలితే చిన్నారులకు పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి ప్రమాదకంగా మారిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను తొలగించి పక్కకు జరపాలని కోరారు. జంట సర్కిలలో బహుళ అంతస్తులు నిర్మించి సొంతంగా ట్రాన్స్ఫార్మారలకు స్థలం విడవకుండా రోడ్లపై ఏర్పాటు చేయడం చాలా ప్రమాదకరమన్నారు. భవిష్యత్తులో ఏదైనా పైప్ లైన్ వియాలంటె రోడ్లు పగలగొట్టవలసి వస్తుందని ఇకనైనా ట్రాన్స్ఫారం వేసేటప్పుడు మున్సిపల్ అనుమతి లేనిది రోడ్లపైన ట్రాన్స్ఫర్ చేయకుండా జిహెచ్ఎంసి అధికారులు ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ కు నోటీసులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జోనల్ పరిధిలో నాణ్యతలేని ప్లాస్టిక్ ను నివారించాలని , ప్లాస్టిక్ తో చేసిన ఇస్తరాకులను కూడా మార్కెట్లో రాకుండా చూడాలని తయారిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ దేవస్థానాల వద్ద ప్లాస్టిక్ కవర్లు ఇవ్వకుండా వారికి పండుగ సందర్భంగా చెక్కులు ఇస్తున్న సందర్భంగా ప్రతి కమిటీ సభ్యునికి వివరంగా తెలియజేయాలని కోరారు. దీంతో స్పందించిన జోనల్ కమిషనర్ ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను తొలగిస్తామన్నారు.

# దేశంలో ఫిలిం మేకర్‌ల కోసం స్క్రీన్ అకాడెమీ ఆవిష్కరించిన స్క్రీన్

హైదరాబాద్ 10, జూలై (ప్రజా స్ఫూర్తి): భారతీయ సినిమా రంగంలో వర్ధమాన గొంతుకలకు ప్రోత్సాహం కల్పించే దిశగా లాభాపేక్షరహితమైన స్క్రీన్ అకాడెమీని ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ మరియు స్క్రీన్ ఆవిష్కరించాయి. ఈ అకాడెమీకి లోధా ఫౌండేషన్ యొక్క ఫౌండింగ్ ప్యాట్రన్ అభిషేక్ లోధా దీనికి ఉదారంగా తోడ్పాటు అందించారు. ఎఫ్టీఐఐ (పుణె), ఎస్ఆర్ఎఫ్టీఐ (కోల్‌కతా), విజ్లింగ్ ఉడ్స్ (ముంబై) లాంటి ప్రతిష్టాత్మక సంస్థలకు చెందిన ప్రతిభావంతులైన ఫిలిం విద్యార్థులకు, ముఖ్యంగా ఆర్థికంగా సవాళ్లు ఎదుర్కొంటున్న వారికి, ఈ అకాడెమీ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఫెలోషిప్‌లను అందిస్తుంది. పరిశ్రమలో సీనియర్లు, ప్రతిష్టాత్మకమైన కాన్ మరియు ఆస్కార్ వంటి పురస్కారాల గ్రహీతలైన గునీత్ మోంగా, పాయల్ కపాడియా, రసూల్ పోకుట్టి తదితరులు విద్యార్థులకు మాస్టర్‌క్లాస్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, ప్రొఫెషనల్ గైడెన్స్ ద్వారా తోడ్పాటు అందిస్తారు.

**అకాడెమీ ప్రత్యేకతలు:**

టాప్ ఫిలిం విద్యార్థులకు వార్షికంగా ఫుల్లీ ఫండెడ్ ఫెలోషిప్‌లు. భారతదేశపు దిగ్గజ ఫిలిం స్కూల్స్‌తో భాగస్వామ్యం.ప్రముఖ ఫిలిం ప్రొఫెషనల్స్‌తో మెంటార్‌షిప్, స్క్రీన్ అవార్డ్స్‌ను కూడా పర్యవేక్షించడం, పటిష్టపర్చడం. అవార్డుల మదింపు ప్రక్రియ సముచితంగా, విశ్వసనీయంగా ఉండేలా రెసిడెంట్ క్రిటిక్స్ ప్యానెల్ ఏర్పాటు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఫిలిం ఇనిస్టిట్యూట్లకు చెందిన పలువురు ప్రముఖులు, అకాడెమీ ఏర్పాటును స్వాగతించారు. "ముంబైతో సినీ పరిశ్రమకు అవినాభావ సంబంధం ఉంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ఏర్పాటు చేసిన స్క్రీన్ అకాడెమీతో భారతీయ సినీ పరిశ్రమకు గణనీయంగా ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నాను" అని ఫడ్నవీస్ తెలిపారు. "వినోదం, సాంస్కృతిక రంగాల్లో శ్రేష్ఠతను సాధించే దిశగా స్క్రీన్ అకాడెమీ ఒక కీలక ముందడుగు. ప్రతిభావంతులకు ఆర్థికంగానే కాకుండా అన్ని రకాలుగా తోడ్పాటు అందించగలిగే వ్యవస్థను మేము తీర్చిదిద్దుతున్నాం" అని ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ అనంత్ గోయెంకా పేర్కొన్నారు. "2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎదగడంలో తోడ్పాటు అందించేందుకు లోధా ఫౌండేషన్ కట్టుబడి ఉంది. స్క్రీన్ అకాడెమీతో జట్టు కట్టడం మాకు సంతోషకరమైన విషయం" అని అభిషేక్ లోధా తెలిపారు.

# విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే ఉన్నతులుగా ఎదుగుతారు

* **రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తే ఉన్నతులుగా ఎదుగుతారని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న అన్నారు. .ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం వక్తృత్వ పోటీలను గురువారం మగ్దూంనగర్లోని చైతన్య విద్యా నికేతన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు పన్నెండు పాఠశాలల విద్యార్థులు పాల్గొని వ్యాస రచన అంశం పై :భూమిపై అధిక జనాభా ప్రభావము..విజేతలు : సుమిత్ చైతన్య విద్యా నికేతన్ పాఠశాల (ప్రధమ),మశ్రీఫా ఎ.ఏం.ఎస్ పాఠశాల (రెండో ),సంకీర్తన జిల్లా పరిషత్ పాఠశాల (జగద్గిరినగర్ ). విద్యార్థులు విజేతలుగా నిలవగా చిత్రలేఖనం అంశంపై: సుస్థిర అభివృద్ధి అధిక వనరులు, అల్ప వనరులు.. విజేతలు..శ్రావణి హోలీఫెయిత్ స్కూల్. (ప్రధమ ),అదీబ ఏ ఏం ఎస్ పాఠశాల (రెండో ),పూజ హరిణి జిల్లా పరిషత్ పాఠశాల (జగద్గిరినగర్ ).విజేతలుగా నిలిచారు.వక్తృత్వ అంశంపై : జనాభా వనరులు : విజేతలు : జోయా చైతన్య విద్యా నికేతన్ పాఠశాల (ప్రధమ ), సఫియఎ ఏం ఎస్ పాఠశాల(రెండో ), ప్రియా శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల (గిరినగర్ ) (మూడో ) విజేతలుగా నిలిచారు. ఈ పోటీలకు ముఖ్య అతిదులు ఆయనతోపాటు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు చైతన్య విద్యా సంస్థల చైర్మన్ శివరాత్రి యాదగిరి



లు హాజరయ్యారు.ఈ సందర్భంగా దరువు అంజన్న మాట్లాడుతూ విద్యార్థుల్లో చైతన్యాన్ని తీసుకొని రావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.. చైతన్య విద్యాసంస్థల చైర్మన్,కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ సామాజిక అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలంటే ఇలాంటి పోటీలు ఎంతో అవసరమన్నారు.కార్యక్రమ దాత ఫాక్ట్ సిస్టమ్స్ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం ఇలాంటి ఒక పోటీల కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు.ఇటువంటి గొప్ప కార్యక్రమం నిర్వహించిన హెల్పింగ్ హార్ట్ సొసైట సంస్థ ప్రతినిధులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకులు తుటే విజయ్ కుమార్,ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే,డాక్టర్ సత్యనారాయణ, కట్టే శ్రీకాంత్,సయ్యద్ సాజిత్,నాగేష్,వీరేందర్ సింగ్ రాథోర్, పాఠశాల డైరెక్టర్స్ శివరాత్రి సాయినాథ్,శివరాత్రి నిఖిల్,తో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ సైబర్ వారియర్‌కు రాచకొండ కమిషనర్ ప్రశంస

* **సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన మహిళా కానిస్టేబుల్‌కు రివార్డ్ ప్రదానం**

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ భాగంగా, ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు రాచకొండ కమిషనర్ జి. సుదీర్ బాబు ఆదేశాల మేరకు ఎల్బీనగర్ పోలీస్ శాఖ అద్భుత కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.ప్రతి రోజు ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో సైబర్ నేరాల పట్ల అప్రమత్తత , అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరస్తులు ఉపయోగించే మోసపూరిత పద్ధతులు, లోన్ యాప్స్, ఫేక్ లింకులు, సోషల్ మీడియా మోసాలు మొదలైన వాటిపై ప్రజలకు వివరంగా తెలియజేస్తున్నారు. ఇలా చేస్తున్న అభినవ ప్రచారానికి రాచకొండ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా ప్రశంసలు తెలియజేశారు.ఈ నేపథ్యంలో, ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వైష్ణవి అనే మహిళా కానిస్టేబుల్ చేసిన అవగాహనా కార్యక్రమాలు సీపీ దృష్టికి వెళ్లడంతో, ఎల్బీనగర్ క్యాంప్ కార్యాలయంలో ఆమెను పిలిపించుకొని స్వయంగా రివార్డ్ అందజేయడం జరిగింది.వైష్ణవి అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసి, 2024 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ బ్యాచ్‌లో పోలీస్ శాఖలో చేరారు. సైబర్ అవగాహన రంగంలో ఆమె చూపుతున్న నైపుణ్యం, ప్రతిబద్ధత సాఫ్ట్వేర్ ఉద్యోగుల స్థాయిలో ఉందని, యువతీ యువకులకు ఆదర్శంగా నిలుస్తారని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం రాచకొండ కమిషనరేట్‌లో పోలీసింగ్‌తో పాటు ప్రజలకు సేవలో కూడా మహిళా పోలీసుల పాత్ర ఎంత ముఖ్యమైనదో మరోసారి చాటిచెప్పింది.

## చేనేత రుణమాఫీ నిధులు వెంటనే జమ చేయండి

**: అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

* **రుణమాఫీ కోసం రూ. 33 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**
* **రాష్ట్ర వ్యాప్తంగా 5,691 మంది కార్మికులకు లబ్ధి**
* **ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్లను వేగవంతం చేయాలని తుమ్మల సూచన**





చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నిధులను తక్షణమే వారి ఖాతాల్లో జమ చేయాలని, వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈరోజు హైదరాబాద్‌లో చేనేత జౌళి శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాల కోసం సెప్టెంబర్ నెలలోపే ఆర్డర్లు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే అందిన ఆర్డర్లకు సంబంధించిన వస్త్రాలను వేగంగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, హైదరాబాద్‌లో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని ఏడాదిలోగా యాదాద్రి జిల్లా పోచంపల్లికి శాశ్వతంగా తరలించాలని ఆదేశించారు. టెస్కో షోరూంల పనితీరును మెరుగుపరిచి, 'మహిళా శక్తి' చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు.ఈ సమీక్షలో భాగంగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 33 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,691 మంది కార్మికులు లబ్ధి పొందనున్నారని, వెరిఫికేషన్ పూర్తి కాగానే నిధులు విడుదల చేస్తామని వివరించారు. 'నేతన్నకు చేయూత' పథకం కింద 194 మంది మృతుల కుటుంబాలకు రూ. 9.70 కోట్లు అందించినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం, 2024 సంవత్సరానికి గాను జాతీయ చేనేత పురస్కారాలకు ఎంపికైన పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మద, గూడ పవన్‌లను మంత్రి తుమ్మల శాలువాతో సత్కరించారు. తెలంగాణ చేనేతకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడం గర్వకారణమని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన భరోసా ఇచ్చారు.

## ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గురువుల ను గౌరవించాలి

* **సామాజిక పర్యవరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గురువుల ను గౌరవించాలని సామాజిక పర్యవరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా గురువారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ షాపూర్ నగర్ ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి, జిల్లా పరిషత్ నెహ్రూ నగర్ ప్రధానోపాధ్యాయులు, ఎం ఈ ఓ జెమినీ లను, అధ్యక్షులు సిహెచ్ చారి లను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ వివేకానందుని సూక్తులు ఆయన జాతికి అందించిన అటువంటి చరిత్రను ప్రతి విద్యార్థి చదవాలని తెలియజేశారు. క్రమశిక్షణతో చదువుపై ఏక గ్రత సంస్కారం నేర్చుకోవాలన్నారు. గురువులకు తల్లితండ్రులకు మంచి పేరు తెచ్చే విధంగా విద్యార్థులు చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉండే ఆరు ఏడు గంటలు మాత్రమేనని మిగతా 17 గంటలు ఇంటి దగ్గరే ఉంటారని , తల్లితండ్రులకు ఆసరాగా ఉంటూ ఉపాధ్యాయులు చెప్పినటువంటి పాఠాలను శ్రద్ధగా విని ఈ పాఠశాలకు ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకోవాలని విద్యార్థులకి గీత బోధన చేశారు. ఎం ఈ ఓ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కై కోట్ల రూపాయలు ఖర్చుపెడుతుందని డ్రస్సులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనాలు అందిస్తుందని దీనిని ఉపయోగించుకొని ఇక్కడ బీఎస్సీ, బీఈడీ మంచి ఉపాధ్యాయులతో విద్యా అందిస్తున్నామని శ్రద్ధగా విని ప్రభుత్వానికి మంచి



పేరు తేవాలన్నారు. మంచిగా చదువుకుంటే ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు 90% ప్రభుత్వ ఉద్యోగాలు మనకే వస్తాయని ఆమె విద్యార్థులకు తెలిపారు. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మా యొక్క పాఠశాలలు టెన్త్ లో 92% శాతం సూచించిన సాధించామని మాకు సరైన గదులు ఉన్నాయని మంచి ఆటస్థలం ఉందని ఇక్కడ చదువుతున్నటువంటి ఉపాధ్యాయులను ఉపయోగించుకొని పై చదువులు కావున మా యొక్క విద్యార్థులను పాటలకు సక్రమంగా చెబుతున్నామని అన్నారు. మా పాఠశాలకు విద్యార్థులు సక్రమంగా రావడం సంతోషకర విషయం అని అన్నారు. ఈ యొక్క పాఠశాలకు ఎవరైనా దాతలు ఉన్నట్లయితే సహకరించి మా యొక్క పాఠశాలను అభివృద్ధికై తోడ్పడాలని మేము మా సహాయ శక్తులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం శాఖ అధ్యక్షులు ఈ సి హెచ్ చారి , పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ ఇళ్ల'లో ఎంపీలకు 40 శాతం కోటా ఇవ్వండి: రేవంత్ కు రఘునందన్ లేఖ

* **లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా కేటాయించాలని రఘునందన్ వినతి**
* **పార్టీలకు అతీతంగా 17 మంది ఎంపీలకు ఈ అవకాశం కల్పించాలని సూచన**
* **దీనివల్ల లబ్ధిదారుల ఎంపిక మరింత పారదర్శకంగా ఉంటుందని వ్యాఖ్య**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పార్లమెంటు సభ్యులకు కూడా భాగస్వామ్యం కల్పించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఎంపీలకు 40 శాతం కోటా కేటాయించాలంటూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈరోజు ఓ లేఖ రాశారు. ఈ నిర్ణయం ద్వారా పేదలకు మరింత న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేల మాదిరిగానే ఎంపీలు కూడా ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులని రఘునందన్ రావు తన లేఖలో పేర్కొన్నారు. అందువల్ల, ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తమకు కూడా అవకాశం కల్పించాలని కోరారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని మొత్తం



17 మంది ఎంపీలకు ఈ కోటాను వర్తింపజేయాలని ఆయన సూచించారు. దీనివల్ల లబ్ధిదారుల ఎంపికలో సహేతుకత, పారదర్శకత పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఎంపీగా పనిచేశారన్న విషయాన్ని రఘునందన్ రావు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులను ఇందిరమ్మ ఇళ్ల పథకంతో అనుసంధానించడాన్ని ఆయన స్వాగతించారు. తన అభ్యర్థనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

## కల్తీ కల్లు ఘటన, కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

* **కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనపై స్పందించిన మాజీ మంత్రి కేటీఆర్**
* **మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్**
* **బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచన**
* **ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని స్పష్టీకరణ**

కూకట్‌పల్లిలో వెలుగుచూసిన కల్తీ కల్లు ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ, బాధితుల పట్ల ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై స్పష్టమైన డిమాండ్లు చేశారు. అదే సమయంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సామాజిక మాధ్యమ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. కల్తీ కల్లు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి విషాదకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. "ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ బుల్డోజర్" అంటూ ప్రస్తుత పాలనను అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసి, ప్రజలు అడగని బుల్డోజర్ పాలనను ముందుకు తెచ్చిందని ఆరోపించారు. పేదలకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు వంటి కీలక హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. మహానగరం నుంచి మారుమూల పల్లెల వరకు బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని, తెలంగాణ ప్రజలు మేల్కోవాలని "జాగో తెలంగాణ జాగో" అంటూ పిలుపునిచ్చారు.

## వైద్యుల సూచన మేరకు యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్

* **హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్**
* **వైద్యుల సూచన మేరకే ఆసుపత్రిలో అడ్మిట్**
* **కొనసాగుతున్న తదుపరి వైద్య పరీక్షలు**
* **ఇటీవలే చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన మాజీ ముఖ్యమంత్రి**
* **వారం రోజుల విశ్రాంతి అనంతరం మళ్లీ చేరిక**



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచన మేరకు గురువారం ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన కేసీఆర్, చికిత్స అనంతరం ఈ నెల 5న డిశ్చార్జ్ అయ్యారు. ఆ సమయంలో రక్తంలో షుగర్, సోడియం స్థాయులను పర్యవేక్షించేందుకు ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. డిశ్చార్జ్ సమయంలో వారం రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, ఆ తర్వాత తదుపరి పరీక్షల కోసం మళ్లీ రావాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు వారం రోజుల విశ్రాంతి అనంతరం కేసీఆర్ మళ్లీ ఆసుపత్రికి వెళ్లారు.

## మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రాజేస్తున్నారు బీఆర్ఎస్‌పై ఎంపీ చామల ఆగ్రహం

* **కేటీఆర్, హరీశ్ రావు మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రాజేస్తున్నారని ఆరోపణ**
* **కేటీఆర్ కేవలం ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి రేవంత్ స్థాయి కాదని వ్యాఖ్య**
* **చర్చకు కేసీఆర్‌ను తీసుకురావాలని కేటీఆర్‌కు సవాల్**
* **రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో కేసీఆర్ ముంచారని విమర్శలు**



బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని వ్యాఖ్యానించారు. భువనగిరి జిల్లా కేంద్రంలో గురువారం ఆయన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వానికి సవాల్ విసరాల్సింది ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ అని, కేటీఆర్ కాదని అన్నారు. నిజంగా దమ్ముంటే కేటీఆర్ తన తండ్రి నుంచి ప్రతిపక్ష హోదా తెచ్చుకుని మాట్లాడాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మిగులు బడ్జెట్‌తో అధికారం చేపట్టిన కేసీఆర్, రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారని ఆరోపించారు. ఆ నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందేదని అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన 299 టీఎంసీల నీటిని పదేళ్ల పాలనలో ఎప్పుడూ పూర్తిగా వాడుకోలేకపోయారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక గత ఏడాది 280 టీఎంసీలు వాడుకున్నామని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించబోమని, ఆరు నూరైనా దాన్ని అడ్డుకుని తీరుతామని కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే 60,000 ఉద్యోగాలు భర్తీ చేసిందని, గత ప్రభుత్వం కేవలం నోటిఫికేషన్లకే పరిమితమైందని ఆయన విమర్శించారు.

## 100 ఏళ్లైనా.. ఏఐతో ఆ స్థానాలను భర్తీ చేయడం సాధ్యం కాదు : బిల్‌గేట్స్



**న్యూయార్క్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ప్రస్తుతం ఎవరి నోట విన్నా ఇదే మాట. ఇప్పుడు ఇది సర్వాంతర్యామి అయిపోయింది. ఎలాంటి ప్రశ్నకైనా ఇట్టే సమాధానం ఇస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ ఏఐ విస్తరించింది.

దీంతో ఏఐ వినియోగం భారీగా పెరిగిపోయింది. ఇది మంచి విషయమే అయినప్పటికీ.. ఏఐ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరిగిపోయింది. చాలా కంపెనీలు తమ ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటించి.. వారి స్థానాల్లో ఏఐని వినియోగిస్తున్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనల వేళ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే 100 ఏళ్లైనా ప్రోగ్రామర్లను ఏఐ భర్తీ చేయలేదన్నారు. అంతేకాదు కోడింగ్ పైనా ఏఐ ప్రభావం ఉండదని చెప్పారు.

ఓ ఇంటర్వ్యూలో బిల్‌గేట్స్ మాట్లాడుతూ.. 'కృత్రిమ మేధ అనేది ప్రోగ్రామింగ్ రంగంలో మనిషికి ప్రత్యామ్నాయం కాలేదు. కేవలం ఒక సహాయకారిగా మాత్రమే పనిచేస్తుంది. ప్రోగ్రామింగ్‌లో క్లిష్టమైన సమస్యగా భావించేదాన్ని క్రియేటీవ్‌గా పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రోగ్రామింగ్‌లో అది సవాలుతో కూడుకున్న విషయం. మానవ మేధస్సు లేని యంత్రాలు (ఏఐ) అలా చేయలేవు' అని బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా కోడింగ్ అంటే కేవలం టైపింగ్ చేయడం కాదని.. చాలా లోతుగా ఆలోచించాల్సి ఉంటుందని బిల్‌గేట్స్ తెలిపారు. ఈ మేరకు భవిష్యత్తులో కోడింగ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, బయాలజీ రంగాలకు ఆటోమేషన్ ముప్పు తక్కువేనని ఆయన అంచనా వేశారు.

## వరుసగా రెండో రోజూ నష్టపోయిన స్టాక్ మార్కెట్లు

**345 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్**

**120 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ప్రధాన కారణం**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి. వరుసగా రెండో సెషన్‌లోనూ అమ్మకాల ఒత్తిడి తీవ్రంగా కనిపించింది. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న సందిగ్ధత, కంపెనీల త్రైమాసిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో సూచీలు భారీ నష్టాలతో ముగియగా, నిఫ్టీ కీలకమైన 25,400 స్థాయిని కోల్పోయింది.

ఉదయం 83,658 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమైన సెన్సెక్స్, ఆ జోరును నిలబెట్టుకోలేకపోయింది. కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 83,134 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయి, చివరికి 345 పాయింట్ల నష్టంతో 83,190 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 120 పాయింట్లు కోల్పోయి 25,355 వద్ద ముగిసింది.

టీసీఎస్ ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా నష్టపోయాయి. అదేవిధంగా భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్, బీఈఎల్ షేర్లు సూచీల పతనానికి కారణమయ్యాయి.

మరోవైపు మారుతీ సుజుకీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ట్రెంట్ షేర్లు లాభపడిన వాటిలో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 69.44 డాలర్లుగా ఉండగా, ఔన్సు బంగారం ధర 3,331 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 85.67 వద్ద కొనసాగుతోంది.

## ఇకపై ఇంటింటికీ 'గ్రీన్ డెలివరీ'..

**భారత్ మరో ముందడుగు**



**న్యూఢిల్లీ:** కాలుష్య రహిత రవాణా దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడిన రెండు సంస్థలు ప్రముఖ క్లీన్ మొబిలిటీ బ్రాండ్ మోంట్రా ఎలక్ట్రిక్ గ్రీన్ డ్రైవ్ మొబిలిటీ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ద్వారా, ఇకపై మీ ఇంటికి చేరే వస్తువులు, సరుకులు పర్యావరణానికి హాని చేయని ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా వస్తాయి. సున్నా ఉద్గారాలతో కూడిన లాజిస్టిక్స్ వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో ఈ రెండు సంస్థలు చేతులు కలిపాయి. రాబోయే కాలంలో డెలివరీ సేవలను మరింత పర్యావరణ హితంగా మార్చడమే ఈ భాగస్వామ్యం ప్రధాన ఉద్దేశ్యం.

సున్నా ఉద్గారాలు వెలువరించే, కర్బన రహిత మొబిలిటీ సొల్యూషన్స్‌ను అందించడం ద్వారా మొదటి మైలు, మధ్య మైలు, చివరి మైలు డెలివరీలలో స్వచ్ఛమైన రవాణా విధానాలు విస్తరిస్తాయి. ఈ భాగస్వామ్యంలో భాగంగా, మోంట్రా ఎలక్ట్రిక్ వచ్చే మూడు నెలల్లో 50 ఇవియాటార్ ఎలక్ట్రిక్ స్మాల్ కమర్షియల్ వాహనాలను (ఈ-ఎస్‌సీవీ) వినియోగంలోకి తెస్తుంది. దీనిపై ఇరు కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయి.

మోంట్రా ఎలక్ట్రిక్ ఇవియాటార్, ఈ విభాగంలోనే అత్యుత్తమ సామర్థ్యాలు కలిగి ఉంది. అత్యాధునిక సాఫ్ట్‌వేర్ ఆధారిత వాహనంగా, టెలీమ్యాటిక్స్ సొల్యూషన్స్‌తో పని చేస్తుంది. ఎక్కువ లోడ్ మోయగల సామర్థ్యం, స్మార్ట్ టెక్ ఫీచర్లు, శక్తి ఆదా చేసే ప్రత్యేకత దీని సొంతం. భారత్‌లో కర్బన రహిత, సున్నా ఉద్గారాల లాజిస్టిక్స్ సాకారం చేయాలన్న గ్రీన్ డ్రైవ్ లక్ష్యానికి ఇది పూర్తిగా సరిపోతుంది. తొలి 50 వాహనాలను దశలవారీగా ప్రవేశపెడతారు. దీని ద్వారా గ్రీన్ డ్రైవ్ టెక్ ఆధారిత ఫ్లీట్ నిర్వహణ వ్యవస్థ మరింత పటిష్టమవుతుంది. ఇది రియల్-టైమ్ ట్రాకింగ్, స్మార్ట్ రూట్ ప్లానింగ్, ఏఐ-ఆధారిత పనితీరు విశ్లేషణలకు వీలు కల్పిస్తుంది.

"గ్రీన్ డ్రైవ్ మొబిలిటీతో చేతులు కలవడం చాలా సంతోషం. ఈ భాగస్వామ్యం భారత లాజిస్టిక్స్ వ్యవస్థలో స్వచ్ఛమైన రవాణా వాడకాన్ని వేగవంతం చేస్తుంది. ఇవియాటార్ అత్యాధునిక ఎలక్ట్రిక్ శక్తితో పని చేస్తుంది. ఆకట్టుకునే రేంజ్ అందిస్తుంది. వివిధ విభాగాల వ్యాప్తంగా ఆధునిక రవాణా అవసరాలకు పూర్తిగా సరిపోతుంది. కాలుష్య రహిత భవిష్యత్తు సాధించాలన్న మా ఉమ్మడి లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా గ్రీన్ డ్రైవ్‌తో కలిసి పని చేయడం సంతోషం" అని సజు నాయర్ తెలిపారు.

# లార్డ్స్ టెస్ట్.. ఆసక్తికరంగా తొలి రోజు ఆట



**లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్ట్ ప్రారంభం**

**టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్**

**తొలి రోజు మూడో సెషన్ సమయానికి 4 వికెట్లకు 225 పరుగులు**

**89 పరుగులతో ఆడుతున్న జో రూట్**

**రెండు వికెట్లు పడగొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి**

**బుమ్రా, జడేజాలకు చెరో వికెట్**

**లార్డ్స్:** భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో తొలి రోజు ఆట ఆసక్తికరంగా సాగింది. గురువారం మూడో సెషన్ సమయానికి ఇంగ్లండ్ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసి నిలకడగా ఆడుతోంది. సీనియర్ బ్యాటర్ జో రూట్ (89 బ్యాటింగ్) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, భారత బౌలర్లు ఆరంభంలోనే దెబ్బతీశారు. నితీశ్ కుమార్ రెడ్డి తన అద్భుత బౌలింగ్‌తో ఓపెనర్లు బెన్ డకెట్ (23), జాక్ క్రాలీ (18) ఇద్దరినీ స్వల్ప వ్యవధిలో పెవిలియన్ పంపాడు. దీంతో ఇంగ్లండ్ 44 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఓలీ పోప్ (44), జో రూట్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. నిలకడగా ఆడుతున్న ఈ జోడీని రవీంద్ర జడేజా విడదీశాడు. పోప్‌ను ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. కాసేపటికే ప్రమాదకర బ్యాటర్ హ్యారీ బ్రూక్ (11)ను జస్ప్రీత్ బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ మళ్లీ కష్టాల్లో పడింది.

అయితే, జో రూట్ ఒకవైపు వికెట్లు పడుతున్నా సంయమనంతో ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అతనికి కెప్టెన్ బెన్ స్టోక్స్ (35 బ్యాటింగ్) తోడవడంతో ఇంగ్లండ్ తొలి రోజు పటిష్ట స్థితిలో నిలిచింది. భారత బౌలర్లలో నితీశ్ రెడ్డి రెండు వికెట్లు తీయగా, బుమ్రా, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. తొలి రోజు ఆటలో ఇరు జట్లు సమంగా పోరాడటంతో మ్యాచ్ ఆసక్తికరంగా మారింది.



## నవంబర్ 19 నుంచి లెజెండ్స్ లీగ్ క్రికెట్



**న్యూఢిల్లీ:** క్రికెట్ అభిమానులను రంజింపజేసేందుకు మరో లీగ్ సిద్ధమవుతోంది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఒకటైన లెజెండ్స్ లీగ్ క్రికెట్ నాలుగో సీజన్ త్వరలోనే షురూ కానుంది. గురువారం ఎల్ఎల్‌సీ లీగ్ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆటను ఎంతగానో ఆదరించే భారత్ వేదికగా నవంబర్ 19 న ఈ మెగా టోర్నీ ప్రారంభం అవుతుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన స్టార్ ఆటగాళ్ల మెరుపులతో కళకళలాడే ఈ క్రీడా సంబురం డిసెంబర్ 13 వరకూ జరుగనుంది. బోల్డర్, బిగ్గర్, బ్రైటర్ అనే థీమ్‌తో నాలుగో సీజన్‌ను నిర్వహించనున్నారు.

'లెజెండ్ క్రికెట్ లీగ్ నాలుగో సీజన్ షెడ్యూల్ విడుదల చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈసారి అభిమానులను మరింతగా అలరించడం కోసం మ్యాచ్‌ల సంఖ్యను పెంచుతున్నాం. అలానే ఈ ఎడిషన్‌లో వేదికల సంఖ్య కూడా పెరగనుంది. అంతేకాదు భారీగా అంతర్జాతీయ క్రికెట్ దిగ్గజాలు ఈ టోర్నీలో తళుక్కుమనేందుకు సిద్ధమవుతున్నారు. చెప్పాలంటే ఇదొక క్రీడా పండుగను తలపించనుంది. ఈ లీగ్ నిర్వహణతో భారత దేశం పేరును మరోసారి విశ్వవ్యాప్తం చేద్దాం' అని ఎల్ఎల్‌సీ లీగ్ ఛైర్మన్ వివేక్ ఖుషలానీ తెలిపాడు.

ఈసారి భారత్‌లోని పలు పట్టణాల్లో లీగ్‌ను జరిపేందుకు నిర్వాహకులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే.. మ్యాచ్‌ల వేదికలను త్వరలోనే వెల్లడించే అవకాశముంది. ఈసారి కూడా సూపర్ స్టార్లతో నిండిన బిల్వారా కింగ్స్, గుజరాత్ జెయింట్స్, ఇండియా క్యాపిటల్స్, మణిపాల్ టైగర్స్, సదరన్ సూపర్‌స్టార్స్, అర్బన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి.

ఎల్ఎల్‌సీ మూడో సీజన్‌లో శిఖర్ ధావన్, సురేశ్ రైనా, మార్టిన్ గుప్టిల్, గౌతం గంభీర్, క్రిస్ గేల్, హషీం ఆమ్లా, రాస్ టేలర్ వంటి వెటరన్స్ తమ బ్యాటింగ్ విన్యాసాలతో అభిమానులను ఖుషీ చేశారు. ఈసారి కూడా అదే జోష్‌తో చెలరేగిపోవాలని అనుకుంటున్నారీ లెజెండరీ ప్లేయర్స్.

## చెత్త ఆటకు భారీమూల్యం..



**తొమ్మిదేళ్లలో 'బ్లూ టైగర్స్'కు అత్యల్ప ర్యాంక్..!**

**న్యూఢిల్లీ:** ఈమధ్య కాలంలో చెత్త ఆటకు భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది. ఫిఫా వరల్డ్ ర్యాంకింగ్స్‌లో మరింత వెనకబడింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు స్థానాలు కోల్పోయింది. గురువారం ఫిఫా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో 'బ్లూ టైగర్స్' 133వ ర్యాంక్‌లో నిలిచింది. ఈ తొమ్మిదేళ్లలో టీమిండియా ఇంత తక్కువ ర్యాంక్‌కు దిగజారడం ఇదే మొదటిసారి. 2016లో 135వ ర్యాంక్ ఇప్పటివరకూ మన జట్టుకు అత్యల్ప ర్యాంక్‌గా ఉంది. గురువారం అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య విడుదల చేసిన ర్యాంకిగ్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాలో అగ్రస్థానంలో ఉండగా.. స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, బ్రెజిల్ జట్లు టాప్ -5లో కొనసాగుతున్నాయి.

నిరుడు వందలోపు ర్యాంక్ సాధించిన భారత జట్టు.. ఈ సీజన్‌లో మైదానంలో తీవ్రంగా నిరాశపరుస్తోంది. సీనియర్ ఆటగాడు సునీల్ ఛెత్రీ వీడ్కోలు పలకడం, కోచ్ మనొలో మర్కెజ్‌పై వేటు కారణంగా జట్టు ప్రదర్శన పాతాళానికి చేరింది. జూన్ 4న థాయ్‌లాండ్‌తో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో టీమిండియా 0-2తో ఓటమి పాలైంది.

ఆసియా కప్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో మరీ దారుణంగా తమకంటే తక్కువ ర్యాంక్ జట్టైన హాంకాంగ్ చేతిలో 0-1తో పరాజయం మూటగట్టుకుంది. ఈ సీజన్‌లో బ్లూ టైగర్స్ పేలవ ప్రదర్శన కారణంగా సునీల్ ఛెత్రీ యూటర్న్ తీసుకొని జట్టుతో కలిశాడు. అతడి రాకతో జట్టు ఆత్మస్థైర్యం పెరగనుంది. అక్టోబర్‌లో జరుగబోయే ఆసియా క్వాలిఫయర్స్‌లో సింగపూర్‌తో భారత్ తలపడనుంది.

## ఇంగ్లండ్‌పై తొలి సిరీస్ విజయం..

**చరిత్ర సృష్టించిన భారత అమ్మాయిలు..!**

**మాంచెస్టర్:** భారత మహిళల క్రికెట్ జట్టు కొత్త చరిత్ర సృష్టించింది. నాలుగో టీ20లో చిరస్మరణీయ విజయంతో ఇంగ్లండ్ గడ్డపై తొలిసారి సిరీస్ విజేతగా అవతరించింది టీమిండియా. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన ఆతిథ్య జట్టును ఆరు వికెట్ల తేడాతో ఓడించి మరో మ్యాచ్ ఉండగానే 3-1తో సిరీస్ కైవసం చేసుకుంది. తెలుగమ్మాయి శ్రీచరణి (2/30), ఆల్‌రౌండర్ రాధా యాదవ్(2/15).. షఫాలీ వర్మ(32) భారత జట్టు అద్భుత విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఇంగ్లండ్ గడ్డపై పురుషుల జట్టు సంచలన ప్రదర్శనతో ఔరా అనిపిస్తుంటే.. మహిళల టీమ్ సైతం అదరహో అనిపించింది. 2006లో చివరిసారిగా టీ20లో ఆతిథ్య జట్టును ఓడించిన భారత్.. 19 ఏళ్ల చరిత్రను తిరగరాసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా రెండు విక్టరీలతో ఇంగ్లండ్‌కు షాకిచ్చిన టీమిండియా నిర్ణయాత్మక నాలుగో టీ20లోనూ పంజా విసిరింది.

తొలి వికెట్‌కు 56

మూడో టీ20లో గెలుపొందిన ఇంగ్లండ్ అదే జోరును కొనసాగించలేకపోయింది. స్పిన్నర్లు రాధా యాదవ్(2/15), శ్రీచరణి (2/30)లు తిప్పేయగా ప్రత్యర్థి 127కే పరిమితమైంది. స్వల్ప ఛేదనలో ఓపెనర్లు షఫాలీ వర్మ(32), స్మృతి మంధాన(31)లు ధనాధన్ ఆడారు. తొలి వికెట్‌కు 56 పరుగులు రాబట్టడంతో ఇంగ్లండ్ బౌలర్లు బిక్కమొహం వేశారు. వీళ్లిద్దరూ ఔటయ్యాక జెమీమా రోడ్రిగ్స్(24 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(26)లు జట్టును విజయతీరాలకు చేర్చారు.





'చరిత్రలో నిలిచిపోయే సిరీస్ విజయం పట్ల సంతోషంగా ఉన్నా. మా జట్టులోని ప్రతి ఒక్కరి ప్రదర్శన పట్ల నేనెంతో గర్వపడుతున్నా. ఇంగ్లండ్ పర్యటన కోసం బీసీసీఐ ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించడం మాకు ఎంతో ఉపయోగపడింది. అత్యుత్తమంగా ఆడేందుకు ప్రతిఒక్కరం కష్టపడ్డాం. అనుకున్నట్టే మా వ్యూహాలను అమలుచేసి.. సమిష్టిగా రాణించాం. వచ్చే ఏడాది ఇక్కడే టీ20 వరల్డ్ కప్ ఆడబోతున్నాం. కచ్చితంగా ఈ సిరీస్ విజయం మాలో స్ఫూర్తి నింపుతుంది' అని మ్యాచ్ అనంతరం హర్మన్‌ప్రీత్ వెల్లడించింది. నామమాత్రమైన ఐదో టీ20 జూలై 12న జరుగనుంది. అనంతరం మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఇరుజట్లు తలపడనున్నాయి.

## బాహుబలి విడుదలై
# పదేళ్లు పూర్తి
### రాజాసాబ్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన క్లాసిక్ మూవీ 'బాహుబలి' మొదటి భాగం విడుదలై పది సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా అభిమానులే కాకుండా, చిత్ర బృందమంతా పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయారు. అదే సమయంలో ప్రభాస్ మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అది కూడా ఈసారి తన స్టైలిష్ లుక్ తో. ప్రస్తుతం ప్రభాస్, డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో మొదటి నుంచి సంబంధం ఉన్న మాస్ ప్రొడ్యూసర్ ఎస్.కె.ఎన్ తాజాగా సెట్స్ నుంచి ఓ ఫోటోను షేర్ చేయగా, అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ప్రభాస్ కనిపించిన విధానం అభిమానుల మన్ననలు పొందుతోంది. స్టైలిష్ గా ఓ వింటేజ్ లుక్‌లో – ఓపెన్ షర్ట్, కూల్ గ్లాసెస్, లైట్ బీట్ క్రాఫ్ట్ లుక్ లో కనిపించిన ప్రభాస్ యూత్‌ఫుల్ ఎనర్జీకి ప్రతీకగా నిలిచాడు. చాలాకాలం తర్వాత ప్రభాస్‌ను ఇలాంటి మాస్ క్లాస్ లుక్‌లో చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. ఇదే సందర్భంగా



ఎస్‌కెఎన్ చేసిన వ్యాఖ్యలు కూడా ఫ్యాన్స్‌ను ఉత్సాహపరిచాయి. 'ఇది కేవలం ఓ బర్త్‌డే మూమెంట్ మాత్రమే కాదు, రాబోయే విజయం కోసం మొదటి సూచన కూడా..! ప్రస్తుతం జరుగుతున్న షూటింగ్ సన్నివేశాలు మెస్మరైజ్ చేస్తాయనడం గ్యారంటీ-' అంటూ తెలిపాడు. బాహుబలి పదేళ్లు పూర్తి చేసుకున్న స్పెషల్ రోజున ఇలా ప్రభాస్ నుంచి వచ్చిన తాజా లుక్ అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చిందని చెప్పొచ్చు.



# పూజను వెంటాడుతున్న డిజాస్టర్స్
### ధనుష్ మూవీలో హీరోయిన్ ఛాన్స్ మిస్

టాకీస్: ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసుగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీ-వల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టు-కుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది. తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ- మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలిక మేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## 'కొత్తపల్లిలో ఒకప్పుడు'
# ట్రైలర్ విడుదల

**టాకీస్:** 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన నిర్మాత ప్రవీణ పరుచూరి.. ఇప్పుడు 'కొత్తపల్లిలో ఒకప్పుడు' అనే సినిమాతో, దర్శకురాలిగా, పరిచయం అవుతున్నారు. రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి రానా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జులై 18న ఇది విడుదల కానుంది.




ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం -ట్రైలర్ విడుదల చేసింది. ఇది ఊహించని ట్విస్ట్ లతో.. నాన్ స్టాప్ కామెడితో ఆకట్టుకుంది. ఇందులో రామకృష్ణ అనే యువకుడు ఒక చిన్న పట్టణంలో డ్యాన్స్ స్టూడియో నడుపుతుంటాడు. అతను సావిత్రిని ప్రేమిస్తుంటాడు, ఆమె కూడా అతని భావాలకు స్పందిస్తున్నట్లు- కనిపిస్తుంది. ఓ రోజు సావిత్రి అతన్ని గడ్డివాము వద్ద కలవమని అడుగుతుంది. ఆనందంగా వెళ్లిన రామకృష్ణ జీవితంలో అప్పటి నుంచి భారీ మలుపు తిరుగుతుంది. ఇది కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా, ఒక అనూహ్యమైన మిస్టరీ, దైవిక సంబంధాల నడుమ నడిచే కథ గా మారుతుంది. ఇక మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రల్లో నటిస్తూ తమ పాత్రలకు స్వచ్ఛమైన అమాయకత్వాన్ని తీసుకొచ్చారు. రవీంద్ర విజయ్ కూడా తన పాత్ర ద్వారా బలమైన ప్రభావాన్ని చూపిస్తున్నారు. మొత్తానికి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించడంలో సఫలమైంది. ఈ సినిమా జులై 18 న విడుదలకు సిద్ధమవుతుంది. రొటీన్ ప్రేమ కథలకు భిన్నంగా మలచిన ఈ గ్రామీణ డ్రామా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇచ్చే అవకాశం ఉంది.

# కార్తీ కొత్త సినిమా మార్షల్

**టాకీస్:** తమిళ హీరో కార్తీ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజిగా ఉన్నాడు. విభిన్న కథలతో సినిమాలు చేస్తూ తనకంటూ సెపరేట్ గుర్తింపు తెచ్చుకున్నాడు. అటు తమిళ్ తో పాటు ఇటు తెలుగులోను కార్తీ సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. కార్తీ నటించిన యుగానికి ఒక్కడు, ఖైదీ, ఊపిరి, ఆవారా, ఖాకి, సర్దార్ వంటి సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచాయి. కార్తీ సినిమా అంటే మినిమం గ్యారెంటీ- అనే అభిప్రాయం సినిమా




ప్రేక్షకుల్లో ఉంది. ప్రస్తుతం సర్దార్ కు సీక్వెల్ సర్దార్ 2 తో పాటు- మరో సూపర్ హిట్ ఖైదీ కి సీక్వెల్ ఖైది 2లో నటిస్తున్నాడు కార్తీ. ఇక ఇప్పుడు మరో సినిమా చేస్తున్నాడు. కార్తీ కెరీర్ లో 29వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు 'మార్షల్' అనే టైటిల్ ను ఫిక్స్ చేస్తూ అఫీషియల్ పోస్టర్ ను రిలీజ్ చేసారు మేకర్స్. నేడు చెన్నైలో పూజా కార్యక్రమాలతో మొదలైన ఈ సినిమాకు కోలీవుడ్ సూపర్ హిట్ సినిమా తనక్కారన్ డైరెక్ట్ చేసిన యంగ్ దర్శకుడు 'తమిళ' దర్శకత్వం వహిస్తున్నాడు. యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా భారీ బడ్జెట్‌తో నిర్మించాలని ఎ÷-లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమా కథ రామేశ్వరం నేపథ్యంలో సాగుతుండడం మెజారిటి పోర్షన్ సముద్రం లొకేషన్స్ షూట్ చేయాల్సి ఉందట. అత్యంత భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న మార్షల్ సినిమాను డ్రీమ్ వారియర్ పిచర్స్ బ్యానర్ పై ప్రకాష్ బాబు, ఎస్ ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు.

## రెడ్ డ్రెస్‌లో రెడ్ హాట్‌గా మెరిసిన
# తెలుగమ్మాయి ఈషా రెబ్బ..

టాకీస్: తెలుగు అమ్మాయి ఈషా రెబ్బ హీరోయిన్ గా రాణించలేకపోతుంది. కెరీర్ స్టార్టింగ్ లో హీరోయిన్ గా సినిమాల్లో నటించి మెప్పించింది ఈషా రెబ్బ. తన అందంతో.. అభినయంతో ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ చిన్నదాని ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఎక్కువే ఈషా రెబ్బ హీరోయిన్ గా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. కానీ అంతగా క్లిక్ అవ్వలేదు. ఇక సక్సెస్ కాలేక పోయినా.. సెకండ్ హీరోయిన్ గా మాత్రం మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ అందాల భామ. ఎన్టీఆర్ హీరోగా నటించిన అరవింద సమేత సినిమాలో హీరోయిన్ సిస్టర్ గా నటించి మెప్పించింది ఈషా రెబ్బ. ఇక ఈ బ్యూటీ చాలా సినిమాలో సెకండ్ హీరోయిన్ గా.. స్పెషల్ రోల్స్ లో నటించి మెప్పించింది. అలాగే పలు వెబ్ సిరీస్ లోనూ నటించింది. త్రీ రోజెస్ సినిమాలో కొంచం బోల్డ్ పాత్రలో నటించి మెప్పించింది ఈషా రెబ్బ. కానీ ఈ బ్యూటీకి అనుకున్నంత గుర్తింపు రాలేదు. ఇక ఈ చిన్నది సోషల్ మీడియాలో రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ తన అభిమానులను మెప్పిస్తుంది ఈషా రెబ్బ. ఓవైపు చీరకట్టులో ప్రేక్షకులను అలరిస్తూ.. మరోవైపు మోడ్రన్ డ్రస్ లో హాట్ హాట్ ఫోజులు ఇస్తూ ఆకట్టుకుంటుంది ఈ వయ్యారి భామ. ప్రస్తుతం తరుణ్ భాస్కర్ తో ఓ సినిమాలో నటిస్తుంది. అలాగే 3 రోజెస్ 2 సిరీస్ లో నటిస్తుంది. తాజాగా ఈ వయ్యారి సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు వదిలింది. రెడ్ కలర్ డ్రస్ లో రెడ్ హాట్ గా క్రేజీ ఫోటోలు షేర్ చేసింది. ఈ ఫొటోల్లో తన అందాలతో ఆకట్టుకుంటుంది. ఈ ఫోటోలకు కుర్రాళ్ళు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



## విజయ్ సేతుపతి.. మూవీ తెలుగులో
# సార్ మేడమ్




టాకీస్: మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తలైవన్ తలైవి'. ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే తమిళంలో టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను తెలుగులో సార్‌మేడమ్ పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఫుడ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు- తెలుస్తుంది. ఈ టీజర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మధ్య ఉండే కెమిస్ట్రీని చూపించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.